బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం-9, అక్టోబర్ - 2026

balagamtv100@gmail.com

పేజీలు-8

కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

వివరాలు 2లో..

మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

- టెలికాం రంగంలో సరికొత్త విప్లవం తెచ్చాం
- డిజిటల్ ఇండియా'తో టెక్నాలజీ అందుబాటులోకి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ భారత టెలికాం, డిజిటల్ రంగాల ప్రగతిని సమగ్రంగా వివరించారు. కరోనా సంక్షోభ సమయంలోనూ వెనకడుగు వేయకుండా టెలికాం సేవలను గ్రామీణ ప్రాంతాల వరకు బలంగా తీసుకెళ్లామని చెప్పారు. డిజిటల్ కనెక్టివిటీ ఆధారంగానే పల్లెల్లో ఉండే ప్రజల

మిగతా 3లో..

వ్యాపారులకు భారీ ఊరట..

- పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు
- ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు
- ఇ-కామర్స్ వ్యాపారులకు జరిమానా తగ్గింపు
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పై అధ్యయనానికి కమిటీ
- జీఎస్టీ నిభంధనల్లో సంచలన మార్పులు
- జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు
- 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు! 4లో..

జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

- 14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్ నమోదు
- ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన పాలన
- సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి
- అందుకే రైతులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన
- రైతులపై కేసులు పెట్టడం హేయమైన చర్య
- రైతులపై కేసుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 08: జూరాల ఎడమ గట్టు కాలువ నుంచి నీటిని విడుదల చేసుకున్న రైతులపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదు తో 14 మంది రైతులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పంటలు ఎండుతున్నందున కాలువల కు నీటిని విడుదల చేయాలంటూ గత నెలలో స్థానిక గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. అయినప్ప టికీ అధికారులు స్పందించక పోవడంతో సెప్టెంబర్ 19న ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ ధ్వంసం చేసి బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు అధికారుల విధులకు ఆటంకం

మిగతా 3లో..

గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!

- అమెరికాలో పెర్మ్ సస్పెన్షన్..
- ఐటీ దిగ్గజాలకు భారీ షాక్
- భారత టెక్కీల గ్రీన్ కార్డ్ ఆశలు గల్లంతు!

వివరాలు 2లో..

పేదల ఓట్లు తొలగించే కుట్ర

- ఓటు హక్కు హరణకు బీజేపీ పార్టీ పన్నాగం
- సైమన్ కమిషన్‌లా ఉపయోగించే ప్లాన్
- మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి
- గల్లీ నుంచి దిల్లీ వరకూ పోరాటం తప్పదు
- ఢిల్లీ ఇండియా కూటమి నిరసనలో రేవంత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో

మిగతా 3లో..

సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- మోదీ, షాకు సద్బుద్ధి కలగాలి
- రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు

వివరాలు 2లో..

బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగించే కుట్ర

- సర్ ప్రక్రియతో ఆ కుట్రకు తెరతీసారు
- అభిజీత్ దీపేష్, ధ్రువ్ రాఠీ, ప్రకాశ్ రాజ్
- సీఈసీ రాజీనామాకు పలువురు డిమాండ్
- పీపుల్స్ ట్రైబ్యునల్ పేరుతో భారీ నిరసన
- కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన

వివరాలు 2లో..

ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

- క్రమటోస్క్ బస్టాప్‌పై బాంబుల వర్షం
- బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు క్షిపణి దాడు లతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోస్క్ పట్టణంలో రద్దీగా ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి. మృతదేహాలు, శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఏడాదిలో రష్యా జరిపిన దాడుల్లో పౌరులు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం ఇదే తొలిసారి

మిగతా 3లో..

కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

- సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసన
- భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 08: హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టుల అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా

మిగతా 3లో..

రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

- విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు
- అనవసర గందరగోళం సృష్టించరాదు
- మాజీ న్యాయమూర్తుల ఘాటు వ్యాఖ్యలు!

వివరాలు 2లో..

కొత్త ఓటు కోసం భారీగా దరఖాస్తులు..

- 4.88 లక్షల అప్లికేషన్లు నమోదు
- ఫామ్-6 దరఖాస్తులు అందజేత
- ఫారం-7 దరఖాస్తు గణాంకాలు వెల్లడి
- వంబర్ 9న వెలువడే తుది జాబితా
- ఓటర్ల సంఖ్యపై రానున్న స్పష్టత

వివరాలు 2లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌పై పోక్సో కేసు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : కేరళలో మైనర్ బాలుడిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ సోషల్ మీడియా మహిళా ఇన్‌ఫ్లుయెన్సర్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. త్రిస్సూర్ జిల్లాలో ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. నిందితురాలిపై త్రిస్సూర్ వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం కింద వివిధ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 11 ఏళ్ల బాలుడిపై నిందితు రాలు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపిస్తూ మూడు రోజుల క్రితం ఫిర్యాదు అందింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారం భించారు. బాలుడి వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. అనంతరం బాలుడికి త్రిస్సూర్ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షలు, బాలుడి వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తును కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన కీలక అంశాలను పోలీసులు ప్రస్తుతం గోప్యంగా ఉంచుతున్నారు. నిందితురాలిని ప్రశ్నించడంతో పాటు ఘటనకు సంబంధించిన ఇతర వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కేసు దర్యాప్తు ప్రస్తుతం కీలక దశలో ఉందని, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్‌కు సంబంధించిన కేసు కావడంతో బాధితుడి గుర్తింపును పోలీసులు వెల్లడించలేదు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళపై చట్టపరమైన చర్యలు దర్యా ప్తులో వెలుగుచూసే ఆధారాల ఆధారంగా ముందుకు సాగుతామని పోలీసులు తెలిపారు.

బీజేపీవ్యతిరేక ఓట్లు తొలగించే కుట్ర

- సర్ ప్రక్రియతో ఆ కుట్రకు తెరతీసారు
- అభిజీత్ దీప్కే, ధ్రువ్ రాఠీ, ప్రకాశ్ రాజ్
- సీఈసీ రాజీనామాకు పలువురు డిమాండ్
- పీపుల్స్ ట్రైబ్యునల్ పేరుతో భారీ నిరసన
- కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కొద్ది రోజులుగా ఈ సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష పార్టీలు సహా కాక్రోచ్ జనతా పార్టీ, ఇతర పౌర సమాజ సంఘాలు నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసే వర్గాల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడానికే ఈ సర్ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ, ఇతర పౌర సమాజ ప్రతినిధులతో కలిసి బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో 'పీపుల్స్ ట్రైబ్యునల్' పేరిట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభిజీత్ దీప్కే సహా ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, నటుడు, కార్యకర్త అయిన ప్రకాశ్ రాజ్- ఎన్నికల సంఘం తీరుపై విరుచుకుపడ్డారు. సర్ ప్రక్రియను తీవ్రంగా విమర్శించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొందరు తాము బతికే ఉన్నాయని చూయించేందుకు ఈ కార్యక్రమానికి వచ్చారని చెప్పుకొ చ్చారు.ఈ క్రమంలోనే వారిలో కొందరిని వేదికపైకి తీసుకొచ్చి 'వారు భౌతికంగా చనిపోలేదు. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతోంది.' అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యా ప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు, ఇంకా ఒక్క కర్ణాటకలోనే దాదాపు కోటి ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఓట్లను తొలగించి, దొంగిలించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యా రని విమర్శించారు. ప్రధాని, ఎన్నికల సంఘం కలిసి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని అన్నారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాలతోనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘం అధికారులు ఓట్లు తొలగిస్తున్నారని విమర్శలు చేశారు. ఇదే సమయంలో రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కూడా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అడ్డుకోవాలని దీప్కే పిలుపునిచ్చారు. ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ మాట్లాడుతూ- తాను ఏ రాజకీయ పార్టీ తరఫున ఈ కార్యక్రమానికి రాలేదని, కేవలం సాధారణ పౌరుడిగా పాల్గొన్నట్లు తెలిపారు. అలానే ఓట్ల చోరీ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన సమస్య కాదని, ప్రతి పౌరుడికీ సంబంధించిన అంశమని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పూర్తిగా లోపించాయని, ఓటరు జాబితా నుంచి పేర్లను ఇష్టారాజ్యంగా తొలగించడం, కొత్తగా చేర్చడం చేస్తున్నారని మండిపడ్డారు. సుప్రీం కోర్టు ఆదేశించే వరకు బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాల్ని ఎన్నికల సంఘం ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. బంగాల్‌లోనూ ఎన్నికలకు ముందు సుమారు 70 వేల మంది ఓటర్ల పేర్లను తొలగించి, ఫలితాల తర్వాత మళ్లీ చేర్చారని ధ్రువ్ రాఠీ ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. నటుడు, కార్యకర్త ప్రకాశ్ రాజ్ కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. సర్ ప్రక్రియతో ఓట్ల తొలగింపు కేవలం ఓటు హక్కుపై దాడి మాత్రమే కాదని, ఇది దేశ ప్రజల ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. 'మా పోరాటం కేవలం జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతోనే ఆగిపోదు. ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తి వచ్చినా ఎలాంటి మార్పు ఉండదు. ఈ సర్ ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలి.' అని ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. గిరిజనులు, ముస్లింలు, పేదలు, ఇతర మైనారిటీ వర్గాల ఓటర్లనే లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఇక నిరసనకారులు తమ ఆందోళనలను శాంతియుతంగా కొనసాగిం చాలని, పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు వారి తరఫున తాము పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- మోదీ, షాకు సద్బుద్ధి కలగాలి
- రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్?కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళులర్పించారు. దిల్లీలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్‌లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపిం చారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు. ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు. ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్కేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్కేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి" అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

దుబ్బాకలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇటుక ట్రాక్టర్ ఢీకొన్న కారు
- ఒకరు మృతి, నలుగురికి సీరియస్!

దుబ్బాక, అక్టోబర్ 08 : దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరి గింది. సిద్దిపేట--రామాయంపేట హైవేపై కారు, ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. అక్బర్‌పేట--భూంపల్లి మండలంలోని అక్బర్‌పేట నుంచి ఇటుకల లోడుతో ఓ ట్రాక్టర్ హబ్షీపూర్ వైపు వెళ్తుండగా.. సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చింది. హబ్షీపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి 765 డీజీపై రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన పడిపోయింది. ప్రమాద తీవ్రతకు కారు తీవ్రంగా దెబ్బతిన్నది. ఢీకొన్న వెంటనే కారు డ్రైవర్ తీవ్ర గాయాలతో వాహనంలోనే చిక్కుకుపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామ శివారులో గురువారం (అక్టోబర్ 08) సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిద్దిపేట--రామాయంపేట హైవేపై కారు, ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట--భూంపల్లి మండలంలోని అక్బర్‌పేట నుంచి ఇటుకల లోడుతో ఓ ట్రాక్టర్ హబ్షీపూర్ వైపు వెళ్తుండగా.. సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చింది. హబ్షీపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి 765 డీజీపై రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన పడిపోయింది. ప్రమాద తీవ్రతకు కారు తీవ్రంగా దెబ్బతిన్నది. ఢీకొన్న వెంటనే కారు డ్రైవర్ తీవ్ర గాయాలతో వాహనంలోనే చిక్కుకుపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెం టనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులకు సమా చారం అందించారు. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీ సులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థాని కుల సహకారంతో గాయపడిన నలుగురిని చికిత్స కోసం సమీ పంలోని ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అతివేగమా.. డ్రైవింగ్‌లో నిర్లక్ష్యమా.. లేక మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలతో పాటు క్షతగాత్రుల వివరాలు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం పోలీసులు వెల్లడించాల్సి ఉంది. ఈ ఘటనతో హబ్షీపూర్ పరిసరాల్లో విషాదం నెలకొంది.

రామగుండంలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

ఈనెల 14న నిర్వహించేందుకు భారీ ప్లాన్

హైదరాబాద్, అక్టోబర్ 08: సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. అందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈనెల 14వ తేదీన రామగుండంలో ' సింగరేణి కార్మిక గర్జన ' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రతినిధులతో హరీశ్‌రావు సమావేశమై మాట్లాడారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి.. సంస్థ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సమస్యలు, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై వారితో హరీశ్ రావు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికులకు రావాల్సిన వాటాను పూర్తిగా చెల్లించాలని హరీశ్‌రావు ప్రధానంగా డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన కార్మిక కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని, క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని కోరారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని.. సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కూడా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందంటూ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తన వాదనకు సంబంధించి 2023-24లో 70 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి.. 2025-26లో 58 మిలియన్ టన్నులకు తగ్గిందని పేర్కొన్నారు. పరిపాలనా నిర్ణయాలు, టెండర్లు, కాంట్రాక్టు వ్యవహారాల కారణంగానే ఉత్పత్తి తగ్గిందని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికుల ఇళ్ల హక్కుల అంశాన్ని కూడా ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 76 కింద మిగిలిన అర్హులైన కార్మికులకు సేల్ డీడ్‌ల ద్వారా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి సంస్థకు సంబంధించిన ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తామని తెలిపారు. రామగుండంలో జరగనున్న ఈ సభ ద్వారా సింగరేణి కార్మికుల సమస్యలను రాష్ట్రస్థాయిలో మరింతగా ప్రస్తావించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు, సభకు పెద్ద సంఖ్యలో కార్మికులు, సింగరేణి ప్రాంత ప్రజలు తరలివచ్చేలా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 14వ తేదీన సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని జీఎం కార్యాలయ మైదానంలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కొత్త ఓటు కోసం భారీగా దరఖాస్తులు..

- 4.88 లక్షల అప్లికేషన్లు నమోదు
- ఫామ్-6 దరఖాస్తులు అందజేత
- ఫారం-7 దరఖాస్తు గణాంకాలు వెల్లడి
- వంబర్ 9న వెలువడే తుది జాబితా
- ఓటర్ల సంఖ్యపై రానున్న స్పష్టత

హైదరాబాద్, అక్టోబర్ 08: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా 4,88,417 ఫామ్-6 దరఖాస్తులు అందినట్లు ఎన్ని కల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ూ దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి అంశాల కోసం 5,04,782 ఫామ్-8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్-7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి.ఫామ్-7 ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నా రు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే కొత్త ఓటు నమోదు కోసం అత్యధిక దరఖాస్తులు హైదరా బాద్ జిల్లా నుంచి వచ్చినట్లు ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 29,226 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 మంది ఎన్ఆర్ఐలు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 ఫామ్-8 దరఖాస్తులు అందాయి. ఓటర్ల తొలగింపు అంశంలో హైదరాబాద్ జిల్లా కూడా చర్చనీయా శంగా మారింది. ఫామ్-7ల దాఖలాపై హైదరాబాద్ నగరం లో రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్నికల అధికా రులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇటీవల బల్క్‌గా సమర్పి ంచిన ప్రీ-ఫిల్డ్ ఫామ్-7ల వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల హైదరాబాద్ జిల్లాలో ఓటు తొల గింపు కోసం అందించే? ఫారం-7ల బోగస్? పత్రాల కట్టలు లభ్యమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. అయి తే ఇవాళ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం (ఎస్?ఈవో) రాష్ట్రవ్యా ప్తంగా వచ్చిన ఫారం-7లపై స్పష్టతనిచ్చింది. ఇందులో భాగం గా హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 నియోజకవర్గాల నుంచి 6,335 ఫారం-?7లు వచ్చినట్లు ఎస్?ఈవో ప్రకటించింది. ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫారం-7లుగా రాగా, అందులో 87 తొలగించినట్లు తెలిపింది. గోషామహల్‌లో 222 ఫారం-7లకు గానూ 87 తొలగించినట్లు ఎన్నికల కార్యాలయం స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 6,335 ఫారం-7లు అందగా, ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన ఫారం-6లు అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచే వచ్చినట్లు ఎస్?ఈవో వెల్లడించింది. ఈ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కొత్త ఓటు కోసం మొత్తంగా 1,93,135 దరఖాస్తులు రాగా, అందులో ఇప్పటి వరకు 29,226 అప్లికేషన్లను ఆమోదించింది. ఈ ప్రాంతం నుంచి 4,127 ఎన్ఆర్ఐలు కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎస్?ఈవో వెల్లడించింది. దీంతో పాటు? జిల్లా పరిధిలో అడ్రస్, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.

ఏఐ భద్రత, డీప్‌ఫేక్‌ల కట్టడిపై సమాలోచనలు

మానవ కేంద్రిత విధానానికే తొలి ప్రాధాన్యత

ఏఐ నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : కృత్రిమ మేధ (ఏఐ) నియంత్రణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఏఐ భద్రత, డీప్‌ఫేక్‌ల కట్టడి, మానవ కేంద్రిత విధానం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ, నెల రోజుల్లోగా ఒక సంప్రదింపుల పత్రం తీసు కురానున్నట్లు కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ పత్రం ఆధారంగానే భవిష్య త్తులో ఏఐ నియంత్రణ నిబంధనలను రూపొందించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ అభివృద్ధి నివేదిక విడుదల కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. ఏఐ నియంత్రణకు సమయం ఆసన్నమైందని, ఈ టెక్నాలజీని ఎలా నియంత్రించాలనే దానిపై అభిప్రాయాలు సేకరించేందుకే ఈ సంప్రదింపుల పత్రం విడు దల చేస్తున్నట్లు తెలిపారు. "ఏఐ వినియోగానికి సంబంధించిన భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. దీనిపై దృష్టి సారించేలా ఒక నియంత్రణ-కేంద్రీకృత సంప్రదింపుల పత్రం తీసుకురా వాలని నేను విభాగాన్ని కోరుతున్నాను" అని వైష్ణవ్ పేర్కొన్నారు. డీప్‌ఫేక్‌లు సమాజంలో పెను సంక్షోభాన్ని సృష్టించగల ఒక పీడ అని వైష్ణవ్ అభివర్ణిం చారు. వాటి సామర్థ్యం రోజురోజుకు మెరుగవుతోందని, ప్రజలు వాటిని సులభంగా నమ్మి తప్పుడు మార్గాల్లోకి వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్‌ల వల్ల సమాజంలో తప్పుడు అభిప్రాయాలు, కథనాలు ప్రచారంలోకి వస్తాయని ఆయన హెచ్చరించారు. ప్రతిపాదిత నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌లో నైపుణ్యాభివృద్ధి, భద్రత, టెక్నాలజీ అభివృద్ధిలో ఎవరూ వెనుకబడకుండా చూడటం వంటి అంశాలు కూడా ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. ఏ మార్పు వచ్చినా అందులో మానవాళి ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని, నియం త్రణ విధానంలో ఇదే కేంద్ర బిందువుగా ఉండాలని ఆయన అన్నారు. ఏఐని కేవలం చట్టాల ద్వారా మాత్రమే నియంత్రిం చలేమని, సాంకేతికత, చట్టం కలగలిసిన 'టెక్నో-లీగల్' పరిష్కా రం అవసరమని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. సైబర్ సెక్యూరిటీ, యూజర్ హార్మ్, డీప్‌ఫేక్‌ల వంటి ప్రమాదాలను ఎదుర్కోవడంలో సంస్థలదే ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. "ఈ సంప్రదింపుల పత్రం

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

ముంగిటకు బ్యాంకింగ్, వైద్యం సహా కీలకమైన ప్రభుత్వ సేవలను చేర్చడం సాధ్యమైందని స్పష్టం చేశారు. విప్లవాత్మక టెలికాం సంస్కరణల ద్వారా దేశంలో పారదర్శక పాలనను మరింత బలోపేతం చేశామని, పేదలకు అందాల్సిన సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టకుండా కాపాడగలిగామని తెలిపారు. వ్యవస్థల్లో తీసుకొచ్చిన ఈ మార్పులను ఎవరు వ్యతిరేకించినా సంస్కరణల ప్రయాణం ఆగబోదని స్పష్టం చేశారు.దేశంలో టెలికాం మౌలిక వసతులు ఊహించని రీతిలో విస్తరించాయని మోదీ వెల్లడించారు. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ నెట్‌వర్క్ చేరుకుందని, ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు నిరంతరం సేవలందిస్తున్నాయని తెలిపారు. 2022 నాటి పరిస్థితులతో పోలిస్తే దేశంలో మొబైల్ ఇంటర్నెట్ వేగం ఏకంగా పది రెట్లు పెరగడం గర్వకారణమని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఇన్వెస్ట్', 'ఇన్నోవేట్' నినాదాలతో మొబైల్స్, టెలికాం పరికరాల తయారీలో భారత్ ప్రపంచ కేంద్రంగా అవతరిస్తోందని కొనియాడారు. డిజిటల్ సేవలు పెరుగుతున్న కొద్దీ ఫోన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ భద్రతను పటిష్టం చేయడం అత్యవసరమని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం డీప్‌ఫేక్స్, సైబర్ మోసాలు సమాజానికి అతిపెద్ద సవాలుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, టెక్ సంస్థలు, ఆర్థిక రంగాలు కలిసి డీప్‌ఫేక్స్‌ను అడ్డుకునేందుకు ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల వద్దకు మోసపూరిత సమాచారం చేరకముందే సాంకేతిక సాయంతో అడ్డుకునేందుకు అంతర్జాతీయ టెలికాం ఆపరేటర్లు, జీఎస్ఎంఏ సమష్టిగా పనిచేయాలని సూచించారు.భుత్వ అధినేతగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సమయంలో ఐఎంసీ 10వ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో ప్రత్యేకమని మోదీ చెప్పారు. ఈ ఏడాది జీఎస్ఎంఏ బోర్డు సమావేశానికి భారత్ వేదికగా నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన టెలికాం నిపుణులకు స్వాగతం పలికారు.

జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

కలిగించారంటూ ప్రాజెక్ట్? నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమీవుల్లా అమరచింత ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి, మూలమల్ల, క్యాతెపల్లి తదితర గ్రామాల రైతులు భారీగా గుమిగూడి జూరాల ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ యాక్సెస్ డోర్లు, సెక్యూరిటీ ఫెన్సింగ్?లు సైతం పగులగొట్టినట్లు డీఈఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్?లోకి అనుమతి లేకుండా చొరబడి లెఫ్ట్ కెనాల్ గేట్లను బలవంతంగా ఎత్తి, నీటిని విడుదల చేయడంతో దాని స్ట్రూరాడ్లు వంగిపోయినట్లు తెలిపారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఈ తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై పార్వతి తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వదలాలంటూ సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్?ఎస్, బీజేపీ నేతల పైన కూడా కేసులు నమోదయ్యాయి. మరోవైపు తెలంగాణలో జూరాల సాగునీటి అంశం మరోసారి తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయంటూ జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల కాలువకు నీటిని విడుదల చేసుకున్న 14 మంది రైతులపై కేసులు నమోదైనట్లు అమరచింత ఎస్సై స్వాతి వెల్లడించారు. ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైతులపై కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. పంటలు ఎండిపోతుంటే సాగునీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం సరికాదని విమర్శించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ రైతులు, వివిధ పార్టీల నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులను నీటిని విడుదల చేయాలని కోరినా స్పందన లేకపోవడంతో సెప్టెంబర్ 19వ తేదీన సాయంత్రం కొందరు రైతులు స్వయంగా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 19, 20వ తేదీల్లో జరిగిన ఆందోళనలకు సంబంధించి కేసులు నమోదు అయ్యాయి. జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపైనా కేసులు నమోదు చేశారు. రైతులపై కేసులు నమోదు చేయడంపై హరీశ్‌రావు తన ఎక్స్ అకౌంట్ ద్వారా స్పందించారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే వాటిని కాపాడుకునేందుకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. 'కళ్ల ముందే ఎండుతున్న పంటలకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన బాట పట్టిన రైతులపై కేసులు నమోదు చేయడం అత్యంత హేయమైన చర్య' అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని హరీశ్ రావు ఆరోపించారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే కడుపు మండిన రైతులు రోడ్డెక్కి ప్రశ్నిస్తే వారిపై కేసులు ఎలా పెడతారని ఆయన నిలదీశారు. జూరాల నీటిని విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇంజినీర్లతో రైతులపై కేసులు పెట్టించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో నీటిని లిఫ్ట్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని హరీశ్‌రావు ఆరోపించారు. నీటిని సద్వినియోగం చేసుకోకుండా వదిలేయడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని ఆయన అన్నారు. 'తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సాగునీరు, విద్యుత్ సమస్యలపై రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కేసులు పెట్టడం సరికాదన్నారు. 'ఇది ప్రజా పాలననా.. లేక ప్రజా పీడననా?' అంటూ హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ఇదే వైఖరిని కొనసాగిస్తే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.జూరాల ఆయకట్టు రైతులపై కేసులు నమోదు చేయడాన్ని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి కూడా ఖండించారు. జూరాల డ్యాం వద్ద ఉద్రిక్త పరిస్థితులకు ప్రభుత్వ వైఖరే కారణమని ఆయన విమర్శించారు. కృష్ణా జలాలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే రైతులు ఆందోళనకు దిగాల్సి వచ్చిందని లక్ష్మారెడ్డి ఆరోపించారు. పంటలు ఎండిపోతుంటే రైతులు ఆవేదనతో ధర్నా చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పేదల ఓట్లు తొలగించే కుట్ర

భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి భాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడటంలో సిఇసి విఫలమయ్యారని ఆరోపించారు. పారదర్శకమైన రీతిలో ఎన్నికల వ్యవస్థ సాగాలంటే సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలు ముమ్మాటికీ అక్రమమని, అప్రజాస్వామికమని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టి పారదర్శకమైన ప్రక్రియను చేపట్టే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం వీధిపోరాటాలు చేస్తుందని తేల్చిచెప్పింది. ముట్టడి నేపథ్యంలో రాజ్‌భవన్, లోక్ భవన్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా భద్రతను పెంచారు.

ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

కావడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. "ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్య. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకుంటాం" అని ఆయన హెచ్చరించారు. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న రష్యాపై అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనతో ఇరు దేశాల మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

- విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు
- అనవసర గందరగోళం సృష్టించరాదు
- మాజీ న్యాయమూర్తుల ఘాటు వ్యాఖ్యలు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : దేశంలోని రాజ్యాంగ సంస్థలపై, ముఖ్యంగా ఎన్నికల సంఘం, ఉన్నత న్యాయవ్యవస్థపై జరుగుతున్న విమర్శలపై 42 మంది మాజీ న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశ పౌరులను ఉద్దేశించి వారు ఓ బహిరంగ లేఖ విడుదల చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజకీయ వేదికలపై ఎన్నికల సంఘం అధికారులు, న్యాయస్థానాలపై అవమానకరమైన భాషను ఉపయోగించడం ఆందోళనకరమని లేఖలో పేర్కొన్నారు. కొందరు రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్ల దొంగతనం జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నప్పటికీ, అదే ఆరోపణలకు సంబంధించి కోర్టుల్లో అఫిడవిట్లు, ఆధారాలు సమర్పించే విషయంలో వెనక్కి తగ్గుతున్నాయని వారు విమర్శించారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే ఈవీఎంలపై ఆధారపడే పార్టీలు ఓటమి ఎదురైనప్పుడు మాత్రం వాటి విశ్వసనీయతను ప్రశ్నించడం సరికాదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణపై జరుగుతున్న వివాదాన్ని కూడా మాజీ న్యాయమూర్తులు, అధికారులు ప్రస్తావించారు. 1950 చట్టం ప్రకారం ఓటర్ల జాబితాల సవరణకు చట్టపరమైన ఆధారం ఉందని తెలిపారు. మరణించిన వారు, ఒక ప్రాంతం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారు లేదా అర్హత లేని పేర్లను తొలగించడం, కొత్తగా అర్హత పొందిన పౌరుల పేర్లను చేర్చడం వంటి చర్యలు ఎన్నికల జాబితాలను మరింత ఖచ్చితంగా ఉంచేందుకు ఉద్దేశించినవేనని వివరించారు. నిష్పక్షపాత, విశ్వసనీయ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాలను నిరంతరం సరిచేయడం అవసరమని వారు పేర్కొన్నారు. అయితే ఈ పరిపాలనా ప్రక్రియను కుట్రగా చిత్రీకరించడం ద్వారా ప్రజల్లో అనవసరమైన అనుమానాలు, గందరగోళం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోతే దాని ప్రభావం ప్రజాస్వామ్యంపై తీవ్రంగా ఉంటుందని లేఖలో హెచ్చరించారు. ప్రజల్లో పెరిగే అవిశ్వాసం సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చని, దానిని దేశ వ్యతిరేక శక్తులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలు ఏ ఒక్క ప్రభుత్వం, రాజకీయ పార్టీకి చెందినవి కావని.. అవి దేశ ప్రజలందరికీ చెందినవని గుర్తుచేశారు. వాటి విశ్వసనీయతను దెబ్బతీయడం అంటే పౌరుల ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావం చూపడమేనని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో తీవ్రంగా పోటీ చేయవచ్చని, అయితే రాజ్యాంగ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించకూడదని సూచించారు. ఏదైనా ఫిర్యాదు ఉంటే ఆధారాలతో ఎన్నికల సంఘం లేదా న్యాయస్థానాలను ఆశ్రయించాలని కోరారు. మీడియా సంస్థలు కూడా దర్యాప్తు, ఆధారాలు లేకుండా వచ్చే ఆరోపణలు, పుకార్లను వార్తలుగా ప్రచారం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ సంస్థలు పూర్తి పారదర్శకతతో, రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో పౌరులు కూడా రాజకీయ వాదనలను గుడ్డిగా నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని, విశ్వసనీయ ఆధారాల ఆధారంగానే నిర్ణయాలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల ఓటు శక్తి పై, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని 42 మంది మాజీ న్యాయమూర్తులు,అధికారులుతమ బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

క్యాన్సర్ మందుల ధరలపై కేంద్రం కసరత్తు

- 70 శాతం వరకు ధరల తగ్గింపుకు చర్యలు
- 30 శాతానికి పరిమితం కానున్న ట్రేడ్ మార్జిన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ పరిధిలో లేని అన్ని క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేసింది. ఈ నిర్ణయంతో కొన్ని మందుల గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల వరకు ఆదా అవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ నిర్ణయం బ్రాండెడ్, జనరిక్ మందులతో పాటు దేశీయ, దిగుమతి మందులకూ వర్తిస్తుంది. పేటెంట్ ఉన్నవి, లేనివి కూడా ఇందులోకి వస్తాయి. మందుల సరఫరా వ్యవస్థలో అధిక లాభాలను నియంత్రించడంతో పాటు క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది. క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 29న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం కీలక ప్రశ్నలు వేసింది. ఓ క్యాన్సర్ మందును రిటైలర్లకు సుమారు రూ.2,700కు సరఫరా చేస్తుండగా.. దాని ఎంఆర్‌పీ రూ.27,000గా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. మందులపై ఒకే విధమైన మార్జిన్‌ను నిర్ణయించలేమా అని కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పథకాల కింద చికిత్స పొందుతున్న వారికి ఆసుపత్రుల్లోని సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలని చెప్పడంపైనా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అక్టోబర్ 12న మరోసారి విచారణ జరగనుంది. ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడం ఇదే తొలిసారి కాదు. 2019లో 42 నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) 30 శాతం మార్జిన్‌ను అమలు చేసింది. దీంతో 526 బ్రాండ్ల ఎంఆర్‌పీలు సగటున 50 శాతం తగ్గాయని కేంద్రం తెలిపింది. అప్పట్లో రోగులకు ఏటా సుమారు రూ.984 కోట్ల మేర ఆదా అయినట్లు అంచనా. తాజా నిర్ణయంతో కొన్ని మందుల ధరలు 70 శాతం వరకు తగ్గొచ్చని కేంద్రం చెబుతోంది. 2026 మార్చి నాటికి 131 క్యాన్సర్ మందులకు ఎన్‌పీపీఏ ధర పరిమితులు అమల్లో ఉన్నాయి. జన ఔషధి వంటి పథకాలు, కస్టమ్స్ సుంకాల తగ్గింపుతోనూ క్యాన్సర్ చికిత్స ఖర్చును తగ్గించే చర్యలు కొనసాగుతున్నాయి.

కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

- 1045.46 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 371 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : భారత ఈక్విటీ మార్కెట్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భగ్గుమనడం, వడ్డీ రేట్లు దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలోనే కొనసాగుతాయనే ఆందోళనలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల తరలింపు వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ఫలితంగా సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1045.46 పాయింట్లు (1.44%) పతనమై 71,593.24 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 371.25 పాయింట్లు (1.64%) నష్టపోయి 22,231.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర ఏకంగా 4% పెరిగి బ్యారెల్‌కు 104 డాలర్ల మార్కును దాటడం మార్కెట్లలో భయాందోళనలకు ప్రధాన కారణమైంది. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను మరింత పెంచుతుందనే ఆందోళనలు రేకెత్తించింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 22,179.90 వరకు పడిపోయి, 2026 సంవత్సరంలోనే అత్యంత కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన మద్దతు స్థాయిలను కోల్పోయిందని, ఇప్పుడు 22,000 పాయింట్ల మానసిక మద్దతు స్థాయిపై దృష్టి కేంద్రీకృతమైందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ సూచీ కోలుకోవడానికి ప్రయత్నిస్తే 22,400, ఆ తర్వాత 22,600 వద్ద ప్రతిఘటన ఎదుర్కోవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ కనిపించింది. మెటల్ రంగ షేర్లు అత్యధికంగా నష్టపోగా, ఐటీ రంగం మాత్రం కొంతమేర తట్టుకుని నిలబడింది. సెన్సెక్స్-30 షేర్లలో టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్ మాత్రమే లాభపడగా.. ఐటీసీ, ఇండిగో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, మారుతీ సుజుకీ వంటి దిగ్గజాలు కూడా నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్ల లోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.53%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.34% చొప్పున పడిపోయాయి. రానున్న రోజుల్లో మార్కెట్ దృష్టి క్యూ2 (రెండో త్రైమాసికం) ఫలితాలపైకి మళ్లనుంది. డిమాండ్ స్థిరత్వం, ముడిసరుకుల వ్యయాల నిర్వహణపై కంపెనీల యాజమాన్యాలు చేసే వ్యాఖ్యలు సమీప భవిష్యత్తులో మార్కెట్ గమనాన్ని నిర్దేశించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి

నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

తీవ్ర మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మెదక్, అక్టోబర్ 08 : మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్య కాపురానికి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందు తూ మృతి చెందాడు. మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చింతల వెంకటేష్‌కు ఆరు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా చిల్లసారం (క్షీరసాగర్) గ్రామానికి చెందిన మౌనికతో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. కుటుంబ కలహాల కారణంగా సుమారు రెండేళ్ల క్రితం మౌనిక తన పుట్టింటికి వెళ్లినట్లు సమాచారం. అప్పటి నుంచి ఆమె తిరిగి భర్త వద్దకు రాకపోవడంతో వెంకటేష్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 30న ఇంటి సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకున్న

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

వ్యాపారులకు భారీ ఊరట..

- పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు
- ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు
- ఇ-కామర్స్ వ్యాపారులకు జరిమానా తగ్గింపు
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పై అధ్యయనానికి కమిటీ
- జీఎస్టీ నిభంధనల్లో సంచలన మార్పులు
- జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు
- 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : జీఎస్టీ కౌన్సిల్ గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్టు చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు, ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్టు అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది. మొత్తంగా చూస్తే, జీఎస్టీ అమలులో కఠినమైన క్రిమినల్ చర్యల కంటే పన్ను వసూళ్లు, అనుసరణ, సులభమైన వ్యాపార విధానాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా తాజా నిర్ణయాలు ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఈ మార్పులు పూర్తిగా అమల్లోకి రావడానికి అవసరమైన చట్టపరమైన సవరణలు, తదుపరి ప్రక్రియ కూడా కీలకం కానున్నాయి.

భారత్‌లో స్టార్‌లింక్‌ను అడుగుపెట్టకుండా అడ్డు

- గుత్తాధిపత్యాన్ని కాపాడుకునేందుకే కొందరు కుట్ర
- ఎలాన్‌మస్క్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్‌ను అడుగుపెట్టకుండా భారత్‌లో టెలికాం రంగంలో ఏకఛత్రాధిపత్యం చెలాయిస్తున్న కొందరు శక్తిమంతులు అడ్డుకుంటున్నారని ఆ సంస్థ అధినేత ఎలాన్‌మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత టెలికాం మార్కెట్‌పై తమకున్న గుత్తాధిపత్యాన్ని కాపాడుకునేందుకే వారు ఈ కుట్ర చేస్తున్నారని, ఇది భారత ప్రజలపై చేస్తున్న నేరమని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీని వెనుక ఉన్నది ఎవరో ఇప్పటికే మీరు ఊహించుకోవచ్చంటూ ఎక్స్ వేదికగా మస్క్ చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయితే, ఆయన నేరుగా ఏ కంపెనీ లేదా వ్యక్తుల పేర్లను అందులో ప్రస్తావించలేదు. భారతదేశంలోని మారుమూల గ్రామాలకు ఇప్పటికీ మెరుగైన ఇంటర్నెట్ సదుపాయాలు అందుబాటులో లేవని డాడ్జ్‌డిజైనర్ అనే ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు కీలకంగా మారతాయని అందులో వివరించారు. భారత టెలికాం మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి కొందరు కుబేరులు స్టార్‌లింక్ ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారని మస్క్ ఆరోపించారు. ఈ వ్యక్తులను రష్యాకు చెందిన ఒలిగార్క్‌లతో పోల్చారు. ఒలిగార్క్‌లు అంటే రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై గణనీయమైన ప్రభావం చూపగల సంపన్నులు. భారత్‌లో ఉగ్రవాదులు స్టార్‌లింక్ సేవలను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలను కూడా మస్క్ తోసిపుచ్చారు. భారత దేశంపై స్టార్‌లింక్ శాటిలైట్ బీమ్స్‌ను నిలిపివేశామని, అందువల్ల ఈ సేవలను ఎవరైనా ఉపయోగించారన్న వాదనలు పూర్తిగా అవాస్తవమని ఎక్స్‌లో స్పష్టం చేశారు. మణిపుర్ సమీపంలో మయన్మార్ దళాలు స్టార్‌లింక్ టెర్మినళ్లను స్వాధీనం చేసుకున్నాయని పేర్కొంటూ వచ్చిన మరో పోస్టుపై ఈ చర్చ మొదలైంది. భారత్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ సంకేతాలు అందుబాటులో లేనప్పుడు అక్కడి పరికరాలు ఆ సేవకు అనుసంధానమయ్యే అవకాశం లేదని డాడ్జ్‌డిజైనర్ ఖాతా వాదించింది. భారత్‌లో ఉగ్రవాదులు స్టార్‌లింక్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు అర్థరహితమని పేర్కొంది. ఈ వాదనకు మస్క్ స్పందిస్తూ, భారతదేశంపై స్టార్‌లింక్ బీమ్స్ నిలిపివేసిన విషయాన్ని ధ్రువీకరించారు. స్టార్‌లింక్ అనేది స్పేస్‌ఎక్స్‌కు చెందిన టెలికమ్యూనికేషన్ల అనుబంధ సంస్థ. ఉపగ్రహాల ద్వారా బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను అందించడం దీని ప్రధాన లక్ష్యం. ఇదిలా ఉండగా భారత్‌లో ని మారుమూల ప్రాంతాలకు స్టార్‌లింక్ వంటి సేవలు అవసరమని డాడ్జ్‌డిజైనర్ పోస్టు వివరించింది. మే 2026 నాటికి దేశంలోని 11,256 గ్రామాలకు 4జీ కవరేజీ లేదని పేర్కొంది. మార్చి 2026 నాటికి దేశంలో మొత్తం 1.093 బిలియన్ ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉండగా, వాటిలో 440.87 మిలియన్ల గ్రామీణ ప్రాంతాలకు చెందినవని తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి 100 మందికి 123.80 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 48.31గా ఉందని ఆ పోస్టులో పేర్కొన్నారు. దేశంలోని మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లలో వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ వాటా 4.26 శాతమేనని వివరించారు. ఫైబర్ నెట్‌వర్క్ లేదా మొబైల్ టవర్లను ఏర్పాటు చేయడం కష్టంగా ఉండే మారుమూల గ్రామాలు, పర్వత ప్రాంతాలు, ద్వీపాలకు శాటిలైట్ ఇంటర్నెట్ ద్వారా వేగవంతమైన కనెక్టివిటీ అందించవచ్చని పోస్టు పేర్కొంది. దీనివల్ల గ్రామీణ పాఠశాలల్లో ఆన్‌లైన్ విద్యకు, వైద్య కేంద్రాల్లో దూరవైద్య సేవలకు, చిన్న వ్యాపారాలు తమ వినియోగదారుల పరిధిని విస్తరించుకోవడాని కి ప్రయోజనం కలుగుతుందని తెలిపింది.

ఆన్ కార్సన్‌కు 2026 సాహిత్య నోబెల్..!

కెనడా రచయిత్రిని వరించిన నోబెల్

సాహిత్య హద్దులను చెరిపేసిన రచయిత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : కెనడాకు చెందిన ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త, అనువాదకురాలు, పండితురాలు ఆన్ కార్సన్‌కు 2026 సాహిత్య నోబెల్ బహుమతి దక్కింది. కవిత్వం, వ్యాసం, అనువాదం, ప్రాచీన సాహిత్యం, కల్పనా రచనల మధ్య ఉన్న సరిహద్దులను చెరిపేస్తూ ప్రత్యేకమైన శైలిని అభివృద్ధి చేసినందుకు ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. 1950లో టొరంటోలో జన్మించిన కార్సన్.. చిన్నప్పటి నుంచే ప్రాచీన గ్రీకు సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్నారు. టొరంటో విశ్వవిద్యాలయంలో క్లాసిక్స్ చదివి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రాచీన గ్రీకు సాహిత్యం, పురాణాలు ఆమె రచనల్లో కీలక పాత్ర పోషించాయి. కవయిత్రిగానే కాకుండా అనువాదకురాలిగా, వ్యాసకర్తగా, అధ్యాపకురాలిగా కూడా ఆమె విశేష గుర్తింపు పొందారు. కార్సన్ రచనా ప్రత్యేకతకు 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్' మంచి ఉదాహరణ. 1998లో వెలువడిన ఈ పద్య నవల ప్రాచీన గ్రీకు పురాణంలోని గెరియాన్ కథ ఆధారంగా రూపొందింది. హెరాకిల్స్ చేతిలో హతమైన రెక్కల రాక్షసుడి కథను కార్సన్ ఒక సున్నితమైన యువకుడి ప్రేమ, ఎదుగుదల, వ్యక్తిత్వ అన్వేషణ కథగా మలిచారు. అలాగే ఎలెక్ట్రా, సాఫో వంటి ప్రాచీన గ్రీకు రచనలను అనువదించడం ద్వారా తన శాస్త్రీయ పాండిత్యాన్ని సృజనాత్మక రచనతో మేళవించారు. 2026 నోబెల్ రేసులో కార్సన్ పేరు ముందంజలోనే ఉంది. సాహిత్య ప్రక్రియల మధ్య గీతలను ప్రశ్నిస్తూ దశాబ్దాలుగా సాగించిన ప్రయోగాత్మక రచనకు ఈ పురస్కారం అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది. ఇప్పటివరకు అన్నే కార్సన్ రచనలు, అనువాదాలకు సంబంధించి 20కిపైగా పుస్తకాలు ప్రచురితమయ్యాయి. గ్రిఫిన్ పోయెట్రీ ప్రైజ్, లానన్ లిటరరీ అవార్డు వంటి పలు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలను ఆమె అందుకున్నారు. ఇప్పుడు నోబెల్ సాహిత్య పురస్కారం కూడా ఆమె ఖాతాలో చేరింది. 2025లో హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కైకి నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. ఆయన రచనల్లో కనిపించిన వినూత్నతకు ఈ గౌరవం దక్కింది. తాజాగా 2026లో అన్నే కార్సన్ ఈ అవార్డును అందుకున్నారు. 1901 నుంచి 2025 వరకు నోబెల్ సాహిత్య పురస్కారం 118 సార్లు ప్రకటించగా, మొత్తం 122 మంది ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఇప్పటివరకు 18 మంది మహిళలు నోబెల్ సాహిత్య పురస్కారం పొందారు. 1909లో స్వీడన్‌కు చెందిన సెల్మా లాగర్‌లెఫ్ ఈ అవార్డు అందుకున్న తొలి మహిళగా నిలిచారు. ఈ ఏడాది నోబెల్ పురస్కారం కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనాలు, భారత కరెన్సీలో రూ.11 కోట్లకు పైగా నగదు బహుమతి అందనుంది. ఒక విభాగంలో ఒకరి కంటే ఎక్కువ మంది విజేతలు ఉంటే ఈ మొత్తాన్ని సమానంగా పంచుతారు. ఇక నోబెల్ పురస్కారాల ప్రకటనల్లో భాగంగా శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించనున్నారు. అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక పురస్కారాన్ని ప్రకటించనున్నారు.

క్షమాగుణం వల్లే దేశంలో పెరుగుతున్న నేరాలు

క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి

సుప్రీం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : మరణశిక్షలను జీవిత ఖైదుగా మార్చే విషయంలో సుప్రీంకోర్టు క్షమా గుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయని, దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని దేశ అత్యున్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. గతంలో హత్య కేసుల్లో శిక్షలు 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' సిద్ధాంతం ఆధారంగా ఉండేవని అన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో హత్యలు చాలా అరుదుగా జరిగేవని, కానీ ప్రస్తుత రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మర్డర్ కేసులో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చుకున్న ఒక ఖైదీని ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ వ్యాఖ్యలు చేశారు. 'సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయి. దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఒక తండ్రి తన సొంత పెద్ద కుమార్తెపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేశాడు. ఆ కేసులో అతడి భార్య ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా నిందితుడికి జీవిత ఖైదు పడింది. కొన్నేళ్ల తర్వాత ఆ నిందితుడు పెరోల్‌పై బయటకు వచ్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు పగతో భార్యను (చిన్న కూతురి కళ్ల ముందే) దారుణంగా హత్య చేశాడు. చిన్న కుమార్తె ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఆ నిందితుడు చిన్న కూతురిని చంపలేదనే కారణంతో సుప్రీంకోర్టు అతడి మరణశిక్షను కాస్త మళ్లీ జీవిత ఖైదుగా తగ్గించింది. అందుకే సుప్రీంకోర్టు క్షమించే గుణానికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. మరోవైపు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల కాలంలో జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధాని దిల్లీలో నేరాలను గుర్తించడం, నివారించే అవసరాన్ని వివరించింది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని దిల్లీ పోలీసులు, రవాణా శాఖ, స్థానిక పరిపాలన యంత్రాంగానికి ఆదేశించింది. అలాగే ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులను కఠినంగా తనిఖీ చేయాలని సూచించింది. అవసరమైన అనుమతులు లేకుండా పనిచేస్తున్న అనధికార మద్యం దుకాణాలు, సంస్థలను గుర్తించి చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది. కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా మహిళలపై నేరాలకు సంబంధించి ఇటీవలే దేశ అత్యున్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

నటుడు నానా పటేకర్ కన్నుమూత

- గుండెపోటుతో పటేకర్ కన్నుమూత
- 'నటసామ్రాట్'గా ప్రత్యేక గుర్తింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో 'గమన్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'పరిందా', 'అబ్ తక్ ఛప్పన్', 'యశ్వంత్', 'వజూద్' వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత 'శక్తి: ది పవర్', 'అపహరణ్', 'టాక్సీ నెం 9211' వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్ననలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. 'వెల్‌కమ్' (2007), 'వెల్‌కమ్ బ్యాక్' (2015) చిత్రాలలో ఆయన పోషించిన 'ఉదయ్ శెట్టి' పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'రాజనీతి' చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం 'నటసామ్రాట్'లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా 'యశ్వంత్', 'వజూద్', 'ఆంచ్' వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!

- అమెరికాలో పెర్మ్ సస్పెన్షన్..
- ఐటీ దిగ్గజాలకు భారీ షాక్
- భారత టెక్కీల గ్రీన్ కార్డ్ ఆశలు గల్లంతు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : అమెరికాలో ఐటీ రంగంలో పనిచేస్తూ శాశ్వత నివాస హోదా పొందాలని ఆశపడుతున్న వేలాది మంది భారతీయ నిపుణులకు అమెరికా ప్రభుత్వం తీరని గుండెకోత మిగిల్చింది. అమెరికన్ల ఉద్యోగ అవకాశాలు, వేతన భద్రతను పరిరక్షించడమే ధ్యేయంగా వైట్‌హౌస్ వేదికగా జరిగిన అత్యున్నత సమావేశంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ సంచలన నిర్ణయం ప్రకటించింది. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణలో ఐటీ ఔట్‌సోర్సింగ్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి సంస్థలపై పెర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేసింది. ఇకపై ఈ సంస్థల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులు స్వీకరించబోమని, ప్రస్తుతం ప్రాసెసింగ్‌లో ఉన్న ఫైళ్లను కూడా తక్షణమే నిలిపివేస్తున్నామని తేల్చిచెప్పింది. అసలు అమెరికాలో విదేశీ ఉద్యోగికి జుడీ-2, జుడీ-3 కేటగిరీల కింద గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్ ప్రారంభించాలంటే ఈ పెర్మ్ ప్రక్రియే అత్యంత కీలకమైన, చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగానికి అవసరమైన అర్హతలున్న అమెరికన్ పౌరులు ఎవరూ స్థానికంగా అందుబాటులో లేరని, విదేశీయుడిని నియమించడం వల్ల స్థానిక వర్కర్ల వేతనాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించి సర్టిఫికేషన్ పొందాల్సి ఉంటుంది. ఈ అనుమతి వచ్చిన తర్వాతే కంపెనీలు యూఎస్‌సీఐఎస్ వద్ద ఐ-140 పిటిషన్ దాఖలు చేసే అర్హత సాధిస్తాయి. ఇప్పుడు ఈ ప్రధాన రహదారినే అమెరికా మూసివేయడంతో సదరు దిగ్గజ సంస్థలు తమ ఉద్యోగుల తరఫున గ్రీన్ కార్డ్ ప్రక్రియను ప్రారంభించే అర్హతను కోల్పోయాయి.గత కొన్నేళ్లుగా అమెరికా హెచ్-1బీ మరియు పెర్మ్ నిబంధనలను ఈ ఔట్‌సోర్సింగ్ కంపెనీలు పక్కదారి పట్టిస్తున్నాయని, లొసుగులను ఆసరాగా చేసుకుని విదేశీ నిపుణుల రిక్రూట్‌మెంట్‌లో తీవ్ర దుర్వినియోగానికి పాల్పడ్డాయని ఫెడరల్ దర్యాప్తు బృందాలు నిర్ధారించాయి. దాదాపు 30 లక్షల మంది విదేశీయుల కోసం దరఖాస్తులు చేసి, 2.3 లక్షలకు పైగా హెచ్-1బీ అనుమతులు, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు పొందడం ద్వారా అమెరికన్ పౌరులకు చెందాల్సిన స్థానిక ఉద్యోగ అవకాశాలను దెబ్బతీశారని కార్మిక శాఖ మండిపడింది. తీవ్ర ఫెడరల్ విచారణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, స్థానిక కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ కఠిన ఆంక్షలను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది.

క్షేత్ర స్థాయిలో వివరాలు కచ్చితత్వంతో నమోదు చేయాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

జిల్లాలో భూముల రీ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు కచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

భూభారతి కింద భూముల రీసర్వే ప్రక్రియపై జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, జీపీఓలు, సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా భూ భారతి కింద భూముల రీ సర్వే ఉద్దేశం, ఉపయోగాలు, పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. భూముల రీ సర్వే కోసం జిల్లాలో మొత్తం 18 రోవర్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్వే కోసం ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను నియమించిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వారు విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.భూముల రీ సర్వే రెవెన్యూ అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల టీంలతో చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని స్పష్టం చేశారు.

రీ సర్వేలో భాగంగా ముందుగా గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని, రీ సర్వే ఉద్దేశం, ప్రయోజనాలు, మొత్తం ప్రక్రియ తదితర అంశాలపై గ్రామస్తులకు వివరించాలని సూచించారు. ఏ ఏ భూముల్లో సర్వే చేస్తారో వాటి వివరాలను ముందుగానే చేరవేయాలని తెలిపారు. జీపీఓ, పంచాయతీ కార్యదర్శి సైతం సర్వేలో ఉండాలని అన్నారు .

ముందుగా గ్రామ సరిహద్దు సర్వే చేయాలని, రెవెన్యూ, నీటి పారుదల శాఖ, అటవీ శాఖ తదితర శాఖల అధికారులకు సమాచారం అందజేసి.. వారు సైతం సర్వేలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో భూముల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దాలి..

కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సర్పంచులు, వైద్య సిబ్బందికి నిర్వహించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందుల వినియోగం, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు.క్షయవ్యాధి నివారణకు కృషి చేసిన 20 గ్రామ పంచాయతీల సర్పంచులు, వైద్య సిబ్బందికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. 20 మంది క్షయవ్యాధి బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్

మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో క్షయవ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, సకాలంలో పరీక్షలు నిర్వహించి, బాధితులకు పూర్తిస్థాయి చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాల్లో టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి సమీప ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి

అవసరమైన వైద్యం, మందులు, ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చికిత్స పూర్తయ్యే వరకు బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని,ప్రజల్లో క్షయవ్యాధిపై అవగాహన పెంచి, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.టీబీ రహిత కార్యక్రమానికి బోయినపల్లి మండలం రామన్నపేట, దేశాయిపల్లి, శాభాష్‌పల్లి; ఇల్లంతకుంట మండలం కిష్టారావుపల్లె, ఆరెపల్లి; గంభీరావుపేట మండలం హీరాలాల్ తండా, పొన్నాలపల్లి; కోనరావుపేట మండలం గొల్లపల్లి, శివంగాలపల్లి, మర్రన్నపేట; ముస్తాబాద్ మండలం గోపాలపల్లి; రుద్రంగి మండలం రూప్లానాయక్ తండా, సర్పంచ్ తండా; తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లి; వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా, బావు సింగ్ నాయక్ తండా, ఎర్రగడ్డ తండా, జవహర్ లాల్ నాయక్ తండా; వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి; ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామాలు ఎంపికయ్యాయి.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, వైద్యులు, సర్పంచులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం రాజన్న సిరిసిల్ల జిల్లా

- గ్రామగ్రామాన పదేళ్ల పండుగను ఘనంగా నిర్వహించాలి..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటైన రాజన్న సిరిసిల్ల జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని పదేళ్ల పండుగను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో గురువారం తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ జిల్లా ఆవిర్భావం నుంచి పదేళ్లలో సాధించిన అభివృద్ధిని, ప్రగతిని ప్రజలకు వివరించాలని అన్నారు.

జిల్లా పదేళ్ల ప్రయాణం కేవలం కాలగమనానికి గుర్తు మాత్రమే కాదని, ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి ఆశయాలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. గతంలో ప్రజల కలలుగా ఉన్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు నేడు సాకారమయ్యాయని అన్నారు. నర్సింగ్, వైద్య, వ్యవసాయ కళాశాలలతో పాటు జేఎన్‌టీయూ, పాలిటెక్నిక్ కళాశాలలు, బతుకమ్మ ఘాట్లు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు సహా వేల కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలతో జిల్లా ప్రగతిపథంలో ముందుకు సాగిందని అన్నారు .

వ్యవసాయం, చేనేత, విద్య, వైద్యం, రహదారులు, సాగునీరు, సంక్షేమం వంటి రంగాల్లో జిల్లాలో జరిగిన అభివృద్ధిని ఈ సందర్భంగా స్మరించుకోవాలని అన్నారు. రైతుల శ్రమ, చేనేత కళాకారుల నైపుణ్యం, యువత ఆశయాలు, జిల్లా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా పదేళ్ల పండుగను ప్రజల పండుగగా నిర్వహించాలని కోరారు.

గత పదేళ్లలో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలని,జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళలు, రైతులు, చేనేత కార్మికులు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ పదేళ్ల పండుగ వేడుకల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు,నాయకులు గూడూరి ప్రవీణ్, ఆకునూరి శంకరయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ

—— లోక్ అదాలత్ సభ్యుడు ఆడెపు వేణు

బలగం టీవీ,వీర్నవల్లి:

ప్రజలకు న్యాయంపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరికీ సులభంగా న్యాయం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు లోక్ అదాలత్ సభ్యుడు, న్యాయవాది ఆడెపు వేణు తెలిపారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ ఆదేశాల మేరకు, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. లక్ష్మణాచారి సమన్వయంతో

గురువారం వీర్నపల్లి మండల కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి న్యాయ అవగాహన ఎంతో అవసరమన్నారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వ్యక్తులు తమ హక్కులను సమర్థంగా పరిరక్షించుకోగలరని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు, బలహీన వర్గాల ప్రజలు తమ హక్కులను వినియోగించుకునేందుకు జిల్లా న్యాయ సేవాధికార

సంస్థ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు గుర్రం ఆంజనేయులు, న్యాయవాదులు బూర మధుసూదన్, కోనేటి నరేష్, ఎస్సై లక్ష్మణ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అధిష్టానం కార్యకర్తల మనోభావాలను పట్టించుకోదా?

ఇదేం పద్ధతి.

మూకుమ్మడిగా రాజీనామాకైనా తాము సిద్ధం అని ప్రకటించిన కుడా పట్టింపు లేదా?

బొప్పాపూర్ వాసులకే ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వాలి.

ప్రెస్‌మీట్‌లో డిమాండ్ చేసినా మండల నాయకుల నుండి కానీ జిల్లా నాయకుల నుండి కానీ స్పందన లేదని కాంగ్రెస్ నేతల ఆవేదన.

స్పందించని కాంగ్రెస్ నేతలపై బొప్పాపూర్ కాంగ్రెస్ నాయకుల అసహనం.

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

మార్కెట్ కమిటీ గోదాముల నిర్మాణం కోసం బొప్పాపూర్ రైతులు భూములు ఇచ్చిన నేపథ్యంలో, గ్రామానికి చెందిన వారికి ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు, ఉప సర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఏర్పడి దాదాపు ఎనిమిదేళ్లు కావస్తున్నా బొప్పాపూర్ వాసులకు చైర్మన్ పదవి దక్కలేదని పేర్కొన్నారు.గోదాముల నిర్మాణం కోసం రైతులు తమ భూములు ఇచ్చిన విషయాన్ని పార్టీ అధిష్టానం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గతంలో ఈ అంశంపై ప్రెస్‌మీట్ నిర్వహించి బొప్పాపూర్‌కు చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ, ఇప్పటివరకు అధిష్టానం నుంచి స్పష్టమైన స్పందన రాలేదని తెలిపారు. AMC చైర్మన్ విషయంలో కార్యకర్తలకు గ్రామ శాఖకు నచ్చచెప్పే ప్రయత్నం చేయకుండా కనీసం ఆ ప్రస్తావన లేకుండా మళ్ళీ నూతన కమిటీ ఎన్నుకోవాలని కార్యకర్తలను సంప్రదించడం సిగ్గు చేటు అని అన్నారు చైర్మన్ పదవి ఎంపిక విషయంలో పార్టీ అంతర్గత వర్గపోరు ప్రభావం చూపుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ మండల నాయకుల ఒంటెద్దు పోకడల వల్లనే మండలంలో పార్టీ రెండు వర్గాలుగా చిలిపోయిందన్నారు. వర్గాలను ప్రోత్సహిస్తూ పార్టీలో నాయకుల మధ్య చిచ్చుపెడుతున్నారని పేర్కొన్నారు. స్థానికంగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల అభిప్రాయాలను, బొప్పాపూర్ ప్రజల ఆకాంక్షలను పార్టీ అధిష్టానం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రైతులు మార్కెట్ కమిటీ గోదాముల కోసం భూములు ఇచ్చిన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, బొప్పాపూర్‌కు ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వడంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామంలోనీ రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడానికి వెనక అడుగు వేయం అని హెచ్చరించారు.

విధుల నుంచి తొలగించడంతో పంచాయతీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం.

- బాధితుడిని పరామర్శించిన సీఐటీయూ జిల్లా కోశాధికారి, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా బాధ్యుడు అన్నల్దాస్ గణేష్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

రెండు దశాబ్దాలుగా గ్రామపంచాయతీ కార్మికుడిగా సేవలందించిన వ్యక్తిని విధుల నుంచి తొలగించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పురసాని దేవరాజు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.గురువారం సీఐటీయూ జిల్లా కోశాధికారి, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా బాధ్యుడు అన్నల్దాస్ గణేష్ ఆసుపత్రికి వెళ్లి దేవరాజును పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ దేవరాజును సర్పంచ్, పాలకవర్గం అకారణంగా విధుల నుంచితొలగించారని,

ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ గ్రామపంచాయతీ పాలకవర్గాలు కార్మికుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. జీవో నంబర్ 51 ప్రకారం కార్మికులను తొలగించే అధికారం పాలకవర్గాలకు లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మండల పరిషత్ అధికారులు వెంటనే స్పందించి పంచాయతీ పాలకవర్గాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.దేవరాజు ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడి వైద్య ఖర్చులను సర్పంచ్, పాలకవర్గం భరించాలని, ఎలాంటి షరతులు లేకుండా దేవరాజును వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్.. ఎండుతున్న వరి పంటలు..

-కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ మార్చకపోవడంతో ముస్తఫానగర్‌లో రైతుల నిరసన

బలగం టీవీ,గంభీరావుపేట:

మూడు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ రైతులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

పంట చేతికొచ్చే కీలక సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రత్యామ్నాయ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో పొలాలకు నీరందడం లేదని తెలిపారు. విద్యుత్ సరఫరా లేక బోర్లు పనిచేయకపోవడంతో వరి పంటలు ఎండుముఖం పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పంటలు ఎండిపోయిన తర్వాత చర్యలు తీసుకుంటే తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు.ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, లేకపోతే పంట నష్టానికి బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.

కులం పేరుతో దూషించిన కేసులో డీఎస్పీ విచారణ

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట గ్రామంలో కులం పేరుతో దూషించడంతో పాటు కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేసినట్లు నమోదైన కేసులో సిరిసిల్ల సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కె. నాగేంద్ర చారి సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కొప్పెల్లి (కోపెల్లి) సత్తవ్వ (48), భర్త నర్సయ్య తన ఇంటి పద్దకు అదే గ్రామానికి చెందిన గన్న పద్మారెడ్డి, గన్న బాల్‌రెడ్డి వచ్చి కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేయడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా డీఎస్పీ కె. నాగేంద్ర చారి సంఘటనా స్థలానికి చేరుకుని ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కాంపౌండ్ వాల్‌కు జరిగిన నష్టం, ఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించి వివరాలు సేకరించారు. అలాగే ఘటనకు సంబంధించి సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, ఇతర కీలక అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తును అన్ని కోణాల్లో కొనసాగిస్తూ, సేకరించిన ఆధారాలు మరియు సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు డీఎస్పీ కె. నాగేంద్ర చారి తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్



బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై ఎన్. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో ధూమాల గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా తన పేరు అదరవేణి పరుశురాములు, తండ్రి ఎల్లయ్య, వయస్సు 41 సంవత్సరాలు, హరిదాస్‌నగర్ గ్రామం అని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని ఉప్పుల ప్రభాకర్ ఆదేశాల మేరకు పదిర గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు డ్రైవర్ వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

దీంతో ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఎన్. రమేష్ వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం, అక్రమంగా ఇసుక రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తారని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

తంగళ్లపల్లి మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

తంగళ్ళపల్లి మండలంలోని సారంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ళ లావణ్య - నర్సయ్య , మల్లాపూర్ గ్రామ సర్పంచ్ లావణ్య-రమణరావు, బస్వాపూర్ గ్రామ సర్పంచ్ పుర్మాణి రాజశేఖర్ రెడ్డి ల అధ్వర్యం లో గ్రామపంచాయతీ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మునిగేల రాజు తో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో AMC డైరెక్టర్ పొన్నాల పర్శరం, కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ళ భరత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల తిరుపతి, గ్రామ అధ్యక్షులు సావనపెల్లి బాబు, గడ్డమీది శ్రీనివాస్, దేవరాజు, బలుసాని శ్రీనివాస్, హనీఫ్, జిపిఓ పర్శరాములు, గ్రామపంచాయతీ పాలకవర్గం, రేషన్ షాప్ నిర్వాహకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు..

- 26న రథోత్సవం.. పోస్టర్ల ఆవిష్కరణ..

బలగం టీవీ, సిరిసిల్ల:

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన సమన్వయ సమావేశం బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించారు. 2026–27 సంవత్సరానికి సంబంధించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా రూపొందించిన పోస్టర్లను సమావేశంలో అధికారులు ఆవిష్కరించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్, భద్రత తదితర అంశాలపై అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న రథోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమన్వయ సమావేశంలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, ఆలయ ఈఓ వెంకట మారుతి రావు, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వికాస తరంగిణి సభ్యులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, దేవాలయ అర్చకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోషణపై అవగాహన.. ఆరోగ్యంపై భరోసా..

- అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రజల భాగస్వామ్యం అవసరం..

- పోషకాహారంపై అవగాహన పెంచాలి..

- "మన అంగన్‌వాడీ – మన బాధ్యత" కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి.

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

స్థానిక కళ్యాణ లక్ష్మి గార్డెన్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం–2026 ముగింపు వేడుకల్లో భాగంగా "మన అంగన్‌వాడీ – మన బాధ్యత" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ప్రాధాన్యతను తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు పోషణ మాసం–2026 కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అంగన్‌వాడీ నిర్వహణ కమిటీలు (AMC) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని AMC కమిటీ సభ్యులకు సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన AMC కమిటీలు సమర్థవంతంగా పనిచేసేలా సంబంధిత అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని జిందం కళా చక్రపాణి సూచించారు.

అనంతరం మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక శ్రీమంతం కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణీ స్త్రీలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజు, కౌన్సిలర్ సభ్యులు భాగ్యలక్ష్మి దేవరాజ్, రిక్కమల్లె రజిత సంపత్, ఆకుల స్వప్న కృష్ణ, CDPOలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, ANMలు, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జానపద కళాకారుల జాతరకు పూర్తి సహకారం..

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి

బలగం టీవీ, సిరిసిల్ల:

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన కళాకారులతో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న "కళాకారుల జానపద జాతర" కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరు కావాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి జిందం కళ చక్రపాణి, చక్రపాణి దంపతులను తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ (TFGI) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి సత్తర్ మరియు తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కళాకారులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కళాకారుల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రజలు కళాకారులను ఎంతో గౌరవిస్తూ, అభిమానిస్తూ, వారి కళలను ఆదరిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా సిరిసిల్ల కళాకారులకు పుట్టినిల్లులాంటిదని, ఇక్కడ నిర్వహించనున్న జానపద జాతర కార్యక్రమం కోసం తాను మాత్రమే కాకుండా ఎంతోమంది కళాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఆమె అన్నారు. కళాకారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. "కళాకారుల జానపద జాతర" విజయవంతంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని, కార్యక్రమ నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలను తమ వంతుగా, అలాగే మున్సిపల్ పాలకవర్గ సభ్యుల తరఫున అందించేందుకు ముందుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ జానపద కళలు, కళాకారుల ప్రతిభకు మరింత గుర్తింపు లభించడంతో పాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారులు ఒకే వేదికపై తమ కళలను ప్రదర్శించే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఇరాన్ యుద్ధంలో అమెరికా విమానాలకు భారీ నష్టం

81 అమెరికా సైనిక విమానాలు, డ్రోన్లు ధ్వంసం లేదా దెబ్బతిన్నట్లు నివేదిక

బలగం టీవీ వాషింగ్టన్,

ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో కనీసం 81 అమెరికా సైనిక విమానాలు, డ్రోన్లు ధ్వంసం లేదా దెబ్బతిన్నట్లు కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ మేరకు ఈ వారం నవీకరించిన నివేదికలో వివరాలు పేర్కొంది.

దెబ్బతిన్న లేదా ధ్వంసమైన వాటిలో అమెరికా సైన్యం ఇప్పటికే బహిరంగంగా వెల్లడించిన విమానాలతో పాటు, నష్టంపై సైన్యం వివరాలు వెల్లడించని డజన్ల కొద్దీ డ్రోన్లు కూడా ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఇరాన్‌లో కూలిపోయిన ఇద్దరు వైమానిక సిబ్బందిని రక్షించే ప్రయత్నంలో ధ్వంసమైన విమానాలు కూడా ఇందులో ఉన్నాయి.

మొత్తం 81 విమానాలు, డ్రోన్లలో 45 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, 12 ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు, ఏడు కేఈ-135 స్ట్రాటోట్యాంకర్ వైమానిక ఇంధన సరఫరా విమానాలు, ఒక ఎఫ్-35ఏ లైట్నింగ్-2 యుద్ధ విమానం ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

యుద్ధంలో అమెరికా సైనిక పరికరాలు, స్థావరాలకు జరిగిన నష్టంపై సైన్యం ఇప్పటివరకు పూర్తి స్థాయి జాబితా లేదా నివేదికను విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ నివేదిక యుద్ధ నష్టంపై కొంత అవగాహన కల్పిస్తోందని పేర్కొంది.

అయితే నివేదికలోని కొన్ని వివరాలు ప్రభుత్వ వర్గాల కంటే మీడియా కథనాల ఆధారంగా సేకరించినవేనని స్పష్టం చేసింది. గతంలో ఈ నివేదికకు సంబంధించిన కొన్ని సంచికలను పెంటగాన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కూడా ప్రస్తావించినట్లు తెలిపింది.

నవంబర్ 3 వరకు ఇరాన్‌పై దాడులు చేయం

మధ్యంతర ఎన్నికల వరకు సైనిక చర్యలు పునఃప్రారంభించబోమన్న ట్రంప్

బలగం టీవీ వాషింగ్టన్,

అమెరికా మధ్యంతర ఎన్నికలు జరిగే నవంబర్ 3 వరకు ఇరాన్‌పై సైనిక దాడులను పునఃప్రారంభించబోమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. గురువారం సామాజిక మాధ్యమంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

రిపబ్లికన్ పార్టీ తరపున ఈ వారం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ట్రంప్.. యుద్ధానికి ముగింపు పరిష్కారం ఎన్నికలకు ముందు లేదా ఆ తర్వాతి రోజుల్లో రావచ్చన్న సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో ఇరాన్‌పై పూర్తిస్థాయి సైనిక చర్యలను తిరిగి ప్రారంభించే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేదు. అయితే గురువారం చేసిన సోషల్ మీడియా పోస్టులో నవంబర్ 3న జరిగే మధ్యంతర ఎన్నికలకు ముందు ఏ సమయంలోనూ అమెరికా ఇరాన్‌పై దాడి చేయబోదని ట్రంప్ పేర్కొన్నారు.

యథావిధిగా నాటో అణు విన్యాసాలు

రష్యా అణు హెచ్చరికల మధ్య 'స్టెడ్‌ఫాస్ట్ నూన్'కు ఏర్పాట్లు

బలగం టీవీ, బ్రస్సెల్స్

రష్యా అణ్వాయుధాల వినియోగంపై హెచ్చరికలు చేసినప్పటికీ నాటో తన వార్షిక అణు సైనిక విన్యాసాలను యథావిధిగా నిర్వహించనుంది. 'స్టెడ్‌ఫాస్ట్ నూన్' పేరుతో జరిగే ఈ విన్యాసాలు మంగళవారం ప్రారంభమై 10 రోజుల పాటు కొనసాగనున్నాయి.

ఈసారి ఇటలీ ఆతిథ్యమివ్వనున్న ఈ విన్యాసాల్లో నాటోలోని 17 దేశాలకు చెందిన డజన్ల కొద్దీ విమానాలు పాల్గొనే అవకాశం ఉంది. దశాబ్దానికి పైగా ప్రతి ఏడాది దాదాపు ఇదే సమయంలో ఈ విన్యాసాలను నిర్వహిస్తున్నారు. అణు విధాన విభాగం అధిపతి నసీమా బారోస్ మాట్లాడుతూ.. ఈ విన్యాసాలు రష్యా లేదా ఇతర ఏ దేశానికీ ముప్పు కాదని స్పష్టం చేశారు.

32 దేశాల నాటో కూటమి అణు సంసిద్ధతను పరీక్షించేందుకు ఎలాంటి పరిస్థితులను అనుకరిస్తారు, ఎలాంటి సైనిక పరికరాలను ఉపయోగిస్తారనే వివరాలను అధికారులు వెల్లడించలేదు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలకు ఈ విన్యాసాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

గతంలో అణ్వాయుధాలను మోసుకెళ్లగల బాంబర్ విమానాలు, యుద్ధ విమానాలతో పాటు భూతల దళాలు కూడా పాల్గొన్నాయి. అయితే విన్యాసాల్లో అణు వార్‌హెడ్లు, ప్రత్యక్ష మందుగుండు సామగ్రిని ఉపయోగించరు. ప్రధాన విన్యాసాలు రష్యాకు దూరంగా ఇటలీ పరిసరాల్లోనే జరగనున్నాయి.

ఇదిలా ఉండగా, రష్యా గత నెల చివర్లో నాటో దేశాలు తమ కలినిన్‌గ్రాడ్ ప్రాంతాన్ని రష్యా నుంచి వేరుచేసేందుకు ప్రయత్నిస్తే అణ్వాయుధాలతో సహా అన్ని ఆయుధాలను ఉపయోగించేందుకు వెనుకాడబోమని హెచ్చరించింది. పోలాండ్, లిథువేనియా మధ్య ఉన్న కలినిన్‌గ్రాడ్‌లో రష్యా కీలక బాల్టిక్ నౌకాదళ స్థావరంతో పాటు అణు సామర్థ్యం కలిగిన ఇస్కందర్ క్షిపణులను మోహరించింది.

రష్యా అణు హెచ్చరికలు పెరుగుతున్నప్పటికీ తమకు ఆందోళన కలిగించే విధంగా దాని సైనిక వైఖరిలో పెద్ద మార్పులేవీ కనిపించలేదని నాటో అధికారి నసీమా బారోస్ తెలిపారు.

8 నెలల తర్వాత భూమికి నలుగురు వ్యోమగాములు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సురక్షితంగా తిరిగివచ్చిన అమెరికా, ఫ్రాన్స్, రష్యా వ్యోమగాములు

బలగం టీవీ వాషింగ్టన్,

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఎనిమిది నెలలు గడిపిన నలుగురు వ్యోమగాములు గురువారం భూమికి తిరిగివచ్చారు. అనారోగ్యానికి గురైన సహచరుడి స్థానంలో అతని బృందంతో కలిసి అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన వీరిని స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్ పసిఫిక్ మహాసముద్రంలో లాస్‌ఏంజెల్స్ తీరానికి సమీపంలో సురక్షితంగా దింపింది.

అమెరికాకు చెందిన జెసికా మీర్, జాక్ హాథ్‌వే, ఫ్రాన్స్‌కు చెందిన సోఫీ అడెనోట్, రష్యాకు చెందిన ఆండ్రీ ఫెద్యాయెవ్ బుధవారం అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరారు. సుదీర్ఘ విరామం అనంతరం కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు వారు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. క్యాప్సూల్ మరమ్మతుల కారణంగా వారి స్థానంలో రావాల్సిన కొత్త బృందం మూడు వారాలు ఆలస్యంగా చేరడంతో వీరి తిరుగు ప్రయాణం వాయిదా పడింది.భూమికి చేరుకున్న తర్వాత గాలి తాకిడిని ఆస్వాదించడం, స్నానం చేయడం కోసం ఎదురుచూస్తున్నామని, అడెనోట్ అయితే తిరిగి జలక్రీడల్లో పాల్గొనాలని ఆతృతగా ఉన్నారని ఏపీ తెలిపింది. ''మా అందరిలోనూ భిన్నమైన భావోద్వేగాలు కలగలిసిపోతున్నాయి'' అని మీర్ అంతరిక్షంలో ఉండగా పేర్కొన్నారు.

మీర్, ఆమె బృందం ఫిబ్రవరిలో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. అంతకుముందు అక్కడ ఉన్న నలుగురిలో నాసాకు చెందిన మైక్ ఫింకే అనారోగ్యానికి గురికావడంతో ఆ బృందాన్ని ముందుగానే భూమికి తీసుకొచ్చారు. 65 ఏళ్ల మానవ అంతరిక్ష

ప్రయాణ చరిత్రలో నాసా చేపట్టిన తొలి వైద్య తరలింపు అదే.

అంతరిక్ష కేంద్రంలో ఉన్న సమయంలో మీర్ నాలుగు సార్లు స్పేస్‌వాక్ చేయగా, అడెనోట్ మూడు సార్లు బయటకు వెళ్లి నిర్వహణ, ఆధునికీకరణ పనుల్లో పాల్గొన్నారు. రెండు నెలల తర్వాత ఆర్టెమిస్-2 వ్యోమగాములు చంద్రుడి చుట్టూ ప్రయాణించడాన్ని వారు గర్వంగా వీక్షించారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలను కూడా అంతరిక్ష కేంద్రంలోనే జరుపుకున్నారు.

పనుల మధ్యలో వ్యోమగాములు వినోదానికీ సమయం కేటాయించారు. గత నెలలో డ్యాన్స్ పార్టీ నిర్వహించడంతో పాటు వంటకాల తయారీ ప్రదర్శనలు కూడా చేశారు. జెసికా మీర్ తనలాంటి వంకర జుట్టు కలిగిన మహిళా వ్యోమగాములకు జుట్టు సంరక్షణపై వీడియోను రూపొందించారు. జాక్ హాథ్‌వే తన ప్రత్యేకమైన మీసాలను అంతరిక్షంలోనూ జాగ్రత్తగా తీర్చిదిద్దుకున్నారు.

ప్రస్తుతం అంతరిక్ష కేంద్రంలో అమెరికా, రష్యా, కెనడాకు చెందిన ఏడుగురు వ్యోమగాములు ఉన్నారు. నాసా లెక్కల ప్రకారం 2000లో కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి 26 దేశాలకు చెందిన 298 మంది అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారు.

రాంచీ టీ20లో మంచు కీలకం

టాస్‌దే కీలక పాత్ర.. 2-0 ఆధిక్యంపై భారత్ గురి

బలగం టీవీ, రాంచీ

భారత్, వెస్టిండీస్ మధ్య శుక్రవారం జరిగే రెండో టీ20లో మంచు ప్రభావం కీలకం కానుంది. రాంచీలో శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రాత్రి వేళ మంచు ఎక్కువగా కురిసే అవకాశం ఉండటంతో టాస్ కీలకంగా మారనుంది. భారత జట్టు సాధన సమయంలో మైదానం అంచుల్లో మందంగా మంచు కనిపించింది. దీంతో రాత్రి బౌలింగ్ చేయడం కష్టతరమయ్యే అవకాశముంది.

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్ ఉంటుందని అంచనా. తొలి టీ20లో వెస్టిండీస్‌ను 171 పరుగులకే ఆలౌట్ చేసిన భారత్.. 15 ఓవర్లలోపే లక్ష్యాన్ని ఛేదించి ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అజేయ శతకంతో ఆకట్టుకున్నారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలనే లక్ష్యంతో భారత్ బరిలోకి దిగనుంది.

టికెట్లకు భారీ డిమాండ్

38 వేల మంది సామర్థ్యం ఉన్న జేఎస్‌సీఏ స్టేడియం పూర్తిగా నిండే అవకాశముంది. టికెట్లకు భారీ డిమాండ్ ఉండటంతో బ్లాక్ మార్కెట్‌లో అసలు ధర కంటే దాదాపు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. రూ.3,500కు కొనుగోలు చేసిన టికెట్‌ను రూ.6,000కు విక్రయించినట్లు ఓ ఆటో డ్రైవర్ తెలిపాడు.

రాంచీ వేదికగా 2023 జనవరి తర్వాత తొలిసారి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరుగుతోంది. అప్పట్లో న్యూజిలాండ్ 21 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. అయితే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకుంది. ఈ వేదికపై చివరి అంతర్జాతీయ మ్యాచ్ 2025 నవంబర్‌లో భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన వన్డే.

స్థానిక అభిమానుల దృష్టి ప్రధానంగా జార్ఖండ్‌కు చెందిన వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పైనే ఉంది. 2023లో న్యూజిలాండ్‌తో జరిగిన టీ20లో కేవలం నాలుగు పరుగులకే పరిమితమైన కిషన్‌కు గురువారం స్వస్థలంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌ల కోసం అభిమానులు బారులు తీరగా.. కిషన్ సైతం వారిని సంతోషపరిచాడు. దీంతో సొంత మైదానంలో అతడి ప్రదర్శనపై ఆసక్తి నెలకొంది.

నానా పటేకర్.. నటుడే కాదు షూటర్

55 ఏళ్ల వయసులో జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం

బలగం టీవీ, హైదరాబాద్

నానా పటేకర్ నటుడిగానే కాకుండా షూటింగ్‌లోనూ ప్రతిభ చాటుకున్నారు. 40 ఏళ్ల వయసులో షూటింగ్‌పై ఆసక్తి పెంచుకున్న ఆయన.. 2004లో 55 ఏళ్ల వయసులో జాతీయ స్థాయి షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించారు.

2011లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నానా పటేకర్ తన షూటింగ్ ప్రయాణం గురించి వెల్లడించారు. షూటింగ్ పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా వెళ్లిన సమయంలో వివిధ రకాల తుపాకులను ఉపయోగించడంతో ఈ క్రీడపై ఆసక్తి పెరిగిందని తెలిపారు. ఆ తర్వాత వాటర్ బాటిల్ మూతల వంటి చిన్న వస్తువులను లక్ష్యంగా చేసుకుని సాధన చేసేవారన్నారు.

2001లో తొలిసారి షూటింగ్ పోటీల్లో పాల్గొన్న నానా పటేకర్.. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్, 300 మీటర్ల బిగ్‌బోర్ విభాగాల్లో పోటీ పడ్డారు. ఇందుకోసం పుణెలోని బాలేవాడి ప్రాంతంలోని షూటింగ్ రేంజ్‌లలో సాధన చేశారు.

2004లో ఇండోర్‌లోని బీఎస్ఎఫ్ రేంజ్‌లో జరిగిన 48వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 300 మీటర్ల బిగ్‌బోర్ విభాగంలో రజత పతకం సాధించారు. 2007లో మహారాష్ట్ర జట్టు తరపున పాల్గొని కాంస్య పతకాన్ని కూడా గెలుచుకున్నారు.

కాగా, 1991లో వచ్చిన 'ప్రహార్' చిత్రంలో సైనికుడి పాత్ర కోసం భారత సైన్యం వద్ద శిక్షణ పొందారు. కార్గిల్ యుద్ధ సమయంలోనూ సైన్యంతో కలిసి పనిచేయాలనే ఉద్దేశంతో కమాండో కోర్సు పూర్తి చేసి 60 రోజుల పాటు సైనికులతో కలిసి పనిచేశారు. ద్రాస్, కుప్వారా, సోపోర్, బారాముల్లా, లేహ్ తదితర ప్రాంతాల్లో ఆయన సైన్యంతో ఉన్నారు.

టాపార్డర్‌లో ఆడటమే ఇష్టం..

మూడో స్థానమే నా ఫేవరేట్ బ్యాటింగ్ పొజిషన్

రోహిత్ శర్మ కెప్టెన్సీ నన్ను పూర్తిగా మార్చేసింది

టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ

బలగం టీవీ, హైదరాబాద్

తాను టాపార్డర్‌లో ఆడేందుకే ఎక్కువ ఇష్టపడతానని టీమిండియా టీ20 వైస్ కెప్టెన్, తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ స్పష్టం చేశాడు. జట్టులో మూడో స్థానం (ఫస్ట్ డౌన్) తన ఫేవరేట్ పొజిషన్ అని వెల్లడించాడు. సాధారణంగా టాపార్డర్‌లో బ్యాటింగ్ చేసే ఆటగాడు లోయరార్డర్‌లో వచ్చి ఆడటం చాలా కష్టమని అభిప్రాయపడ్డాడు. అయితే, జట్టు అవసరాల కోసం ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని, లోయరార్డర్‌లోనూ రాణించేందుకు మరింత కష్టపడతానని పేర్కొన్నాడు. ఇటీవల జరిగిన ఆసియా గేమ్స్ 2026 ఫైనల్లో పాకిస్తాన్‌పై అద్భుతమైన హాఫ్ సెంచరీతో భారత్‌కు పసిడి అందించడంలో తిలక్ వర్మ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

6, 7 స్థానాల్లో బ్యాటింగ్ చాలా కష్టం

ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తిలక్ వర్మ తన బ్యాటింగ్ స్థానంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. చిన్నతనంలో తాను ఓపెనర్‌గా ఆడేవాడినని, ఇప్పుడు మళ్లీ ఓపెనింగ్ చేయమన్నా రెడీగా ఉన్నానని తెలిపాడు. టాపార్డర్‌లో ఏ స్థానంలో ఆడినా పెద్దగా తేడా ఉండదని, నాలుగో స్థానం వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పాడు. కానీ, టాపార్డర్ బ్యాటర్ 6 లేదా 7వ స్థానంలో వచ్చి బ్యాటింగ్ చేయాల్సి వస్తేనే తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయని వివరించాడు. లోయరార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి బంతి పాతబడిపోతుందని, బౌలర్లు కూడా యార్కర్లు, స్లోయర్లతో వైవిధ్యంగా బౌలింగ్ చేస్తారని పేర్కొన్నాడు. జట్టు మేనేజ్‌మెంట్‌కు వేరే ఆప్షన్ లేకపోతే తాను లోయరార్డర్‌లో ఆడేందుకు మానసికంగా సిద్ధమవుతానని, ఒక్క మ్యాచ్‌లో సరిగ్గా ఆడితే ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని ధీమా వ్యక్తం చేశాడు.

నన్ను మార్చేసింది రోహిత్ కెప్టెన్సీయే

తనలోని నాయకత్వ లక్షణాలు మెరుగుపడటంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల పాత్ర ఉందన్న తిలక్, ముఖ్యంగా రోహిత్ కెప్టెన్సీ తనను పూర్తిగా మార్చేసిందని చెప్పుకొచ్చాడు. తాను కోహ్లీ నాయకత్వంలో ఎక్కువగా ఆడలేదని, కానీ ముంబై ఇండియన్స్‌తో పాటు భారత జట్టులో రోహిత్ శర్మ సారథ్యాన్ని చాలా దగ్గరగా గమనించానని తెలిపాడు. మైదానంలో రోహిత్ చూపించే నిబద్ధత అద్భుతమని కొనియాడాడు. రోహిత్, కోహ్లీ మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు తాను డగౌట్‌లో కూర్చొని వారు బౌలర్లను ఎలా ఉపయోగిస్తున్నారు, మ్యాచ్ పరిస్థితులను ఎలా నియంత్రిస్తున్నారు అనే విషయాలను నిశితంగా పరిశీలించి ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని తిలక్ వర్మ వివరించాడు.

ఐఎస్ఎల్ ఆరంభంపై మునోజ్ ఉత్సాహం

సుదీర్ఘ ప్రీ-సీజన్ తర్వాత మైదానంలో సన్నాహకాలను అమలు చేస్తాం: బెంగళూరు ఎఫ్‌సీ కోచ్

బలగం టీవీ, బెంగళూరు

ఐఎస్ఎల్ ప్రారంభం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నామని, మైదానంలో తమ సన్నాహకాలను అమలు చేయాలని ఉత్సాహంగా ఉన్నామని బెంగళూరు ఎఫ్‌సీ కోచ్ పెప్ మునోజ్ అన్నారు. శనివారం స్వదేశంలో ఎస్‌సీ ఢిల్లీతో జరిగే మ్యాచ్‌తో సీజన్‌ను బలంగా ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

సుదీర్ఘంగా సాగిన ప్రీ-సీజన్ తర్వాత లీగ్ ఎట్టకేలకు ప్రారంభమవుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఢిల్లీ బలమైన ప్రత్యర్థి అని, ఇటీవల రెండు పోటీల్లో ఆడటంతో మంచి మ్యాచ్ రిథమ్‌లో ఉందని పేర్కొన్నారు. గత సీజన్‌లో 13 మ్యాచ్‌ల్లో 23 పాయింట్లతో బెంగళూరు ఎఫ్‌సీ నాలుగో స్థానంలో నిలిచింది. ఈసారి మెరుగైన ప్రదర్శనపై మునోజ్ నమ్మకం వ్యక్తం చేశారు.

"మా సన్నాహకాలపై పూర్తి విశ్వాసం ఉంది. పోటీపడేందుకు సిద్ధంగా ఉన్నాం. సీజన్‌ను సరైన రీతిలో ప్రారంభించాలని కోరుకుంటున్నాం" అని మునోజ్ తెలిపారు.

ఈ సీజన్‌లో ఐఎస్ఎల్ పాత హోమ్, అవే విధానానికి తిరిగి వచ్చింది. లీగ్ దశ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టుకు షీల్డ్ లభించనుంది. అలాగే ప్లేఆఫ్స్ విధానం తిరిగి రావడంతో టాప్-6 జట్లు ఐఎస్ఎల్ కప్ కోసం పోటీపడనున్నాయి.

అయితే ప్లేఆఫ్స్ విధానంపై మునోజ్ తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు. హోమ్, అవే విధానంలో లీగ్ ముగిసిన తర్వాత విజేతను నిర్ణయించే పద్ధతినే తాను ఇష్టపడతానన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న విధానానికి అనుగుణంగానే ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

లీగ్ ఆలస్యంగా ప్రారంభమైనా, ఆఫ్-ఫీల్డ్ సమస్యలు తమ సన్నాహకాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని మునోజ్ తెలిపారు. జట్టు సిద్ధంగా ఉందని, ఆటతీరు, వ్యూహాలపై సుదీర్ఘంగా పని చేశామని చెప్పారు. శనివారం స్వదేశీ అభిమానుల సమక్షంలో వాటిని మైదానంలో అమలు చేయాలని ఉత్సాహంగా ఉన్నామని పేర్కొన్నారు.

తొలి రోజే మీట్ రికార్డులు తిరగరాసిన కుల్దీప్, ఆశా!

బలగం టీవీ, న్యూఢిల్లీ

65వ నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ గురువారం ఇక్కడ ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజే మధ్యప్రదేశ్ అథ్లెట్ కుల్దీప్ కుమార్, తమిళనాడుకు చెందిన ఆశా ఇలంగో వరుసగా పోల్ వాల్ట్, ట్రిపుల్ జంప్ విభాగాల్లో సరికొత్త మీట్ రికార్డులను నమోదు చేసి సత్తా చాటారు.

మహిళల ట్రిపుల్ జంప్‌లో తమిళనాడు అథ్లెట్ ఆశా ఇలంగో 13.89 మీటర్ల దూరం దూకి, 2015లో మయూఖా జోహ్రా నెలకొల్పిన దశాబ్ద కాలం నాటి 13.78 మీటర్ల మీట్ రికార్డును చెరిపివేశారు. లాంగ్ జంప్ స్పెషలిస్ట్ పైలీ సింగ్ తొలిసారిగా ట్రిపుల్ జంప్‌లో పోటీపడి మూడో స్థానంలో నిలిచారు. అలాగే డోపింగ్ ఆరోపణల కేసులో నాడా (NADA) ప్యానెల్ నుంచి తాత్కాలిక సస్పెన్షన్ లేకపోవడంతో పోటీపడేందుకు అనుమతి పొందిన అభిషేక్ పాల్ 10,000 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

మరోవైపు పురుషుల పోల్ వాల్ట్ విభాగంలో 21 ఏళ్ల కుల్దీప్ కుమార్ 5.30 మీటర్ల ఎత్తు దాటి స్వర్ణ పతకంతో పాటు కొత్త మీట్ రికార్డును సృష్టించాడు. 2022లో ప్రశాంత్ కన్హియా (5.15 మీటర్లు) పేరిట ఉన్న రికార్డును కుల్దీప్ అధిగమించాడు. ఆ తర్వాత 5.40 మీటర్ల ఎత్తు కోసం చేసిన మూడు ప్రయత్నాలు విఫలమయ్యాయి. SSCB కి చెందిన రీగన్ (5.25 మీ) రజతం, రాంబీర్ (5.10 మీ) కాంస్యం గెలుచుకున్నారు.

పురుషుల హ్యామర్ త్రోలో ఢిల్లీకి చెందిన నిర్భయ్ చౌదరి 69.42 మీటర్ల దూరంతో స్వర్ణం సాధించగా, డిస్కస్ త్రోలో కామన్వెల్త్ మెడలిస్ట్ సీమా 57.63 మీటర్ల ప్రదర్శనతో సులభంగా పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. రైల్వేస్‌కు చెందిన గిరిధరణి రవికుమార్ (11.48 సెకన్లు) వేగవంతమైన అథ్లెట్‌గా నిలవగా, రీఎంట్రీ ఇచ్చిన స్ప్రింటర్ మణికంఠ హోబ్లిధార్ సెమీఫైనల్స్‌లో 10.30 సెకన్ల సమయంతో మెరిసి పతక రేసులో నిలిచాడు.

రాజ్‌పుతానా రాయల్స్ ఘనవిజయం!

బలగం టీవీ, హైదరాబాద్

డిఫెండింగ్ ఛాంపియన్ రాజ్‌పుతానా రాయల్స్.. ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (APL) రెండవ సీజన్‌ను విజయంతో ప్రారంభించింది. బుధవారం ఇక్కడ జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో రాజ్‌పుతానా రాయల్స్ 5-3 తేడాతో పృథ్వీరాజ్ యోధాస్‌పై ఉత్కంఠ విజయాన్ని సాధించింది.

కాంపౌండ్ ఆర్చర్లు ఓజస్ దేవతాలే, వరల్డ్ నంబర్-1 ఎల్లా గిబ్సన్‌లు ఆరంభం నుంచే పాయింట్ల వర్షం కురిపించగా, టోక్యో ఒలింపిక్ రీకర్వ్ ఛాంపియన్ మెటె గాజోజ్ సమయాభావంలోనూ కీలకమైన పాయింట్లు సాధించి రాజ్‌పుతానా రాయల్స్ విజయంలో ముఖ్య భూమిక పోషించారు. అభినేష్ వర్మ నేతృత్వంలోని యోధాస్ జట్టు ప్రారంభంలో వెనుకబడినప్పటికీ ఆ తర్వాత పుంజుకుంది. అయితే చివరి బాణంతో మెక్సికోకు చెందిన మథియాస్ గ్రాండే తీవ్రంగా నిరాశపరిచి కేవలం 8 పాయింట్లు మాత్రమే సాధించడంతో యోధాస్‌కు ఓటమి తప్పలేదు.

ప్రపంచంలోనే తొలి ఫ్రాంచైజీ ఆధారిత ఆర్చరీ లీగ్ అయిన ఏపీఎల్‌లో మొత్తం 6 జట్లు, 48 మంది ఆర్చర్లు (36 మంది భారతీయులు, 12 మంది అంతర్జాతీయ స్టార్లు) పాల్గొంటున్నారు. ఈ లీగ్ అక్టోబర్ 18న జరగనున్న గ్రాండ్ ఫినాలేతో ముగుస్తుంది.

మ్యాచ్ విశేషాలు:

తొలి సెట్: తొలి సెట్‌ను రాజ్‌పుతానా రాయల్స్ 73-69 తో సొంతం చేసుకుంది. దేవతాలే, గిబ్సన్‌లు చెలరేగగా అంకిత భగత్, గాజోజ్‌లు సపోర్ట్ అందించారు.

రెండో & మూడో సెట్లు: రెండో సెట్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో ఫలితం సమమై 2-2గా మారింది. మూడో సెట్‌లో పృథ్వీరాజ్ యోధాస్ ఆండ్రియా బెసెరాని బరిలోకి దింపగా, దేవతాలే-అభిషేక్ వర్మాలు సత్తా చాటడంతో మూడో సెట్ 77-77తో టైగా ముగిసింది.

ముగింపు సెట్: నాలుగో సెట్ ప్రారంభంలోనే రాయల్స్ ముప్పై తొమ్మిది పాయింట్లతో ఆధిక్యంలోకి వెళ్ళింది. చివర్లో గాజోజ్ పర్‌ఫెక్ట్ X-రింగ్ 10 సాధించగా, గ్రాండే 8 పాయింట్లకే పరిమితమవడంతో రాజ్‌పుతానా రాయల్స్ 5-3తో విజయాన్ని కైవసం చేసుకుంది.

రెండో రోజు లీగ్ పోరులో కాకతీయ నైట్స్ - చోళ చీఫ్స్; రాజ్‌పుతానా రాయల్స్ - చెరో ఆర్చర్స్; మైటీ మరాఠాస్ - పృథ్వీరాజ్ యోధాస్ జట్లు తలపడనున్నాయి.

ఒడిశా హాకీ సంఘానికి షోకాజ్ నోటీసు

నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు.. శాశ్వత సభ్యత్వం నుంచి తొలగించే ప్రతిపాదన

బలగం టీవీ, భువనేశ్వర్

జాతీయ సమాఖ్య నిబంధనలను పాటించలేదన్న ఆరోపణలపై హాకీ అసోసియేషన్ ఆఫ్ ఒడిశా (హెచ్ఏఓ)కు హాకీ ఇండియా షోకాజ్ నోటీసు జారీ చేసింది. హెచ్ఏఓను శాశ్వత సభ్యత్వం నుంచి అసోసియేట్ సభ్యత్వంగా పునర్వర్గీకరించే ప్రతిపాదనను కూడా చేసింది.

అక్టోబర్ 6న జరిగిన హాకీ ఇండియా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల అధికారికి అందిన ప్రతికూల నివేదిక నేపథ్యంలో అక్టోబర్ 3న జరగాల్సిన హెచ్ఏఓ ఎన్నికలు నిలిచిపోయాయి.

హెచ్ఏఓకు సంబంధించి ఎనిమిది అంశాలపై హాకీ ఇండియా అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ముఖ్యంగా 30 జిల్లా యూనిట్ల పనితీరులో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంది. 30 జిల్లా సంఘాల్లో అధ్యక్షుడు, కార్యదర్శి వంటి కీలక పదవులను ఎన్నికల ద్వారా కాకుండా జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు వంటి పరిపాలనా అధికారులను ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నియమిస్తున్నారని తెలిపింది.

అలాగే ఏ ఒక్క జిల్లా సంఘం కూడా ఎన్నికల నోటీసులు, సమావేశాల మినిట్స్, ఎన్నికల ఫలితాలను సమర్పించలేదని హాకీ ఇండియా పేర్కొంది. దీంతో ఆయా పాలకవర్గాలు చట్టబద్ధమైన ఎన్నికల ప్రక్రియ ద్వారా ఏర్పడ్డాయా లేదా అన్నది నిర్ధారించలేకపోయినట్లు తెలిపింది. అవసరమైన పత్రాలు అందకపోవడంతో హెచ్ఏఓ ఎన్నికల తుది ఓటర్ల జాబితాను కూడా ఖరారు చేయలేకపోయినట్లు వెల్లడించింది.

ఎన్నికలు నిర్వహించినట్లు ఆధారాలు, అవసరమైన చట్టబద్ధ అనుమతులతో సహా పూర్తి పత్రాలను రెండు వారాల్లోగా సమర్పించాలని హెచ్ఏఓను హాకీ ఇండియా ఆదేశించింది. గడువులోగా సమగ్ర వివరణ ఇవ్వకపోతే హాకీ ఇండియా అనుబంధ కమిటీ ద్వారా పునర్వర్గీకరణ ప్రక్రియను ప్రారంభించి, అనంతరం జనరల్ బాడీ ఆమోదానికి పంపే అవకాశం ఉందని తెలిపింది.

హాకీ ఒడిశా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ సత్పతి హాకీ ఇండియా చర్యను స్వాగతించారు. రాష్ట్రంలో హాకీ పరిపాలన పారదర్శకంగా సాగేందుకు ఒడిశా ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు.

కోల్‌కతా ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్‌కు పరాజయం

రష్యా ఘన విజయం!

బలగం టీవీ, కోల్‌కతా

కొత్త ఆటగాళ్లతో బరిలోకి దిగిన భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకు అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో చేదు అనుభవం ఎదురైంది. వర్షం కారణంగా తడిసిన కోల్‌కతాలోని కిషోర్ భారతి క్రీడాంగణం వేదికగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో రష్యా 0-4 తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. ప్రథమార్ధంలో రష్యాను గట్టిగా నిలువరించిన భారత్, ద్వితీయార్ధంలో రష్యా ఒత్తిడికి తలొగ్గక తప్పలేదు.

ప్రపంచ 69వ ర్యాంక్ భారత జట్టు, 27వ ర్యాంక్‌లో ఉన్న రష్యాను ఎదుర్కొంటూ కోల్‌కతాలో తమ తొలి అంతర్జాతీయ మ్యాచ్‌ను ఆడింది. భారత హెడ్ కోచ్ క్రిస్పిన్ ఛెత్రీ భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా ఆరుగురు యువ క్రీడాకారిణులకు (బేబీసనా దేవి, మాలతి ముండా, సిండీ కొల్న, శుభంగి సింగ్, ధుర్గా పెరుమాళ్, సిబాని దేవి) ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం కల్పించారు.

మ్యాచ్ విశేషాలు:

తొలి అర్ధభాగం (1-0): మ్యాచ్ ప్రారంభం నుండి రష్యా బంతిపై ఎక్కువ నియంత్రణ సాధించినప్పటికీ, భారత డిఫెండర్లు, గోల్‌కీపర్ మోనాలికా దేవి క్రమశిక్షణతో కూడిన రక్షణతో అడ్డుకున్నారు. 30వ నిమిషంలో భారత ఫార్వర్డ్ మాళవికకు లభించిన గోల్ అవకాశాన్ని రష్యా కీపర్ నటాలియా అడ్డుకుంది. కాగా, 40వ నిమిషంలో యాస షెయినా అద్భుతమైన షాట్‌తో గోల్ నమోదు చేయడంతో రష్యా 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.

రెండో అర్ధభాగం (3 గోల్స్): భారీ వర్షంతో మైదానం తడవడం వల్ల రెండో అర్ధభాగంలో భారత్ డిఫెన్స్ బలహీనపడింది.

సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన రష్యా ఆటగాడు కిరా పెతుఖోవా 60, 65వ నిమిషాల్లో వరుసగా రెండు గోల్స్ చేసి జట్టు ఆధిక్యాన్ని 3-0 కి పెంచింది.

81వ నిమిషంలో యాస స్విస్తునోవా నాలుగో గోల్ పూర్తి చేయడంతో రష్యా 4-0తో విజయాన్ని ఖరారు చేసుకుంది.

ఓటమి ఎదురైనప్పటికీ, బలమైన ప్రత్యర్థితో 90 నిమిషాల పాటు పోరాడటం, ఆరుగురు నూతన ఆటగాళ్లకు అవకాశం లభించడం భారత్‌కు సానుకూల అంశంగా నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో ఫ్రెండ్లీ మ్యాచ్ అక్టోబర్ 11న జరగనుంది.

శ్రీలంక టెస్టు కెప్టెన్‌గా కుశాల్ మెండిస్

తప్పుకున్న ధనంజయ డి సిల్వా . వచ్చే నెల పాకిస్థాన్‌తో సిరీస్ నుంచే కొత్త బాధ్యతలు

బలగం టీవీ, కొలంబో

శ్రీలంక టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా కుశాల్ మెండిస్‌ను శ్రీలంక క్రికెట్ నియమించింది. టెస్టు కెప్టెన్సీ నుంచి ధనంజయ డి సిల్వా తక్షణమే తప్పుకోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వన్డే, టీ20 జట్లకు సారథ్యం వహిస్తున్న మెండిస్.. వచ్చే నెల పాకిస్థాన్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌తో తొలిసారి టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.

31 ఏళ్ల మెండిస్ శ్రీలంక తరపున 75 టెస్టులు ఆడడంతోపాటు అన్ని ఫార్మాట్లలో కలిపి 343 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు.

ధనంజయ డి సిల్వా 69 టెస్టుల్లో 4,400కు పైగా పరుగులు సాధించాడు. ఇందులో 13 శతకాలు ఉన్నాయి. 2024 జనవరిలో డిముత్ కరుణరత్నె నుంచి టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన ధనంజయ.. 18 టెస్టుల్లో శ్రీలంకకు నాయకత్వం వహించాడు. అతడి సారథ్యంలో శ్రీలంక ఏడు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది.

కెప్టెన్‌గా ధనంజయ 36.45 సగటుతో 1,130 పరుగులు చేయడంతోపాటు తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. అయితే భవిష్యత్ తరానికి బాధ్యతలు అప్పగించాలనే ఉద్దేశంతో కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు శ్రీలంక క్రికెట్ సెలక్షన్ కమిటీకి లేఖ ద్వారా తెలిపారు. ఆటగాడిగా మాత్రం జట్టుకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

ధనంజయ సేవలను శ్రీలంక క్రికెట్ సీఈఓ యాష్లే డి సిల్వా అభినందించారు. టెస్టు జట్టుకు అందించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మిగిలిన కెరియర్‌లో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

వారణాసిలో మరో సర్‌ప్రైజ్..

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న వారణాసిపై రోజురోజుకూ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవలం తెలుగు ప్రేక్షకుల కోసమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. అందుకే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో విపరీతమైన ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. రాజమౌళి గత చిత్రాలైన బాహుబలి, ఆర్ఆర్ఆర్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. అయితే వారణాసి విషయంలో మాత్రం ఆయన మరింత భారీగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, ప్రపంచ నిర్మాణం ఇలా ప్రతి అంశంలోనూ కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దుతున్నారని టాక్. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. వారణాసిలోని కొన్ని కీలక సన్నివేశాల కోసం ప్రత్యేకమైన భాషను, లిపిని రూపొందించినట్లు సమాచారం.కథలోని ఒక ప్రత్యేక ప్రపంచాన్ని మరింత సహజంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించేలా చూపించేందుకు ఈ కొత్త భాషను ఉపయోగించనున్నారనే ప్రచారం జరుగుతోంది. రాజమౌళి గతంలో బాహుబలి కోసం కిలికి అనే ప్రత్యేక భాషను సృష్టించిన విషయం తెలిసిందే. సినిమాలోని కల్పిత ప్రపంచానికి తగ్గట్టుగా ఆ భాషను రూపొందించడం అప్పట్లో ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించింది. ఇప్పుడు వారణాసి కోసం కూడా అలాంటి ప్రయోగమే చేస్తున్నారనే వార్త సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. అయితే ఈ కొత్త భాష సినిమాలో ఏ సందర్భంలో వినిపించనుంది.? దాని వెనుక ఉన్న ప్రపంచం ఏమిటి.? మహేష్ బాబు పాత్రకు దీనికి ఉన్న సంబంధం ఏంటి.? అనే విషయాలు మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉన్నాయి. మొత్తానికి రాజమౌళి వారణాసిని సాధారణ అడ్వెంచర్ సినిమాగా కాకుండా, భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లేలా రూపొందిస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, వరుసగా బయటకు వస్తున్న ఇలాంటి ఆసక్తికరమైన విషయాలు ప్రేక్షకుల్లో అంచనాలను భారీగా పెంచుతున్నాయి.

అతనికి నేను ఒకే చెప్పేశా..

టాలీవుడ్‌లో కథానాయికగా అడుగుపెట్టి దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న నటి అనుష్క శెట్టి. గ్లామర్ పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ముఖ్యంగా అరుంధతి, బాహుబలి, రుద్రమదేవి, భాగమతి వంటి సినిమాలు అనుష్కకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే సినిమాల్లో ఎంత పాపులారిటీ ఉన్నప్పటికీ.. వ్యక్తిగత విషయాల విషయంలో మాత్రం అనుష్క చాలా ప్రైవేట్‌గా ఉంటారు. తన వ్యక్తిగత జీవితం గురించి పెద్దగా మాట్లాడేందుకు ఇష్టపడని ఈ స్వీటీ.. అప్పుడప్పుడు ఇంటర్వ్యూల్లో తన జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటుంటారు. అలాంటి ఓ సందర్భంలో ఆమె చెప్పిన చిన్ననాటి ప్రేమ జ్ఞాపకం ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్న అనుష్క.. తాను ఆరో తరగతిలో ఉన్నప్పుడు జరిగిన ఓ సరదా సంఘటనను పంచుకున్నట్లు సమాచారం. ఓ అబ్బాయి తన దగ్గరకు వచ్చి నేరుగా 'ఐ లవ్ యు' అని చెప్పాడట. అయితే అప్పటికి ప్రేమ అంటే ఏమిటో, 'ఐ లవ్ యు' అనే మాటకు అసలు అర్థం ఏమిటో కూడా తనకు తెలియదని అనుష్క చెప్పుకొచ్చారు. ఆ మాట విన్న వెంటనే ఏం చేయాలో తెలియక అమాయకంగా 'సరే' అని చెప్పేశానని నవ్వుతూ గుర్తుచేసుకున్నారు. చిన్న వయసులో జరిగిన ఆ సంఘటనను ఇప్పుడు తలుచుకుంటే చాలా అమాయకంగా, అందంగా అనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు. తన బాల్యంలో మిగిలిపోయిన మధురమైన జ్ఞాపకాల్లో అదొకటని చెప్పడంతో.. అనుష్క అభిమానులు కూడా ఈ విషయాన్ని ఆసక్తిగా షేర్ చేస్తున్నారు.అనుష్క వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో రకరకాల వార్తలు, ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా ఆమె వివాహం ఎప్పుడు జరుగుతుంది.? ఎవరిని పెళ్లి చేసుకోబోతున్నారు.? అనే ప్రశ్నలు అభిమానుల్లో చాలాకాలంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అదే సమయంలో ఓ పాన్ ఇండియా హీరోతో అనుష్కకు ప్రేమ సంబంధం ఉందంటూ గతంలో పలు సందర్భాల్లో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే అలాంటి ప్రచారాలపై ఇద్దరూ పలుమార్లు స్పందిస్తూ తాము మంచి స్నేహితులమని స్పష్టం చేసిన సందర్భాలు ఉన్నాయి. సినిమాల్లోకి రాకముందు అనుష్క ముంబైలో యోగా శిక్షకురాలిగా పనిచేశారు. ఆ సమయంలో దర్శకుడు పూరీ జగన్నాథ్ దృష్టిలో పడటంతో.. నాగార్జున హీరోగా తెరకెక్కిన 'సూపర్' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత వరుస సినిమాలతో దూసుకుపోతుంది.

'రణబాలి' ట్రైలర్ వచ్చేసింది!

విజయ్ దేవరకొండ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'రణబాలి' సినిమా దసరా కానుకగా థియేటర్లలోకి రానుంది. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ మూవీలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్లు, టీజర్, ఫస్ట్ సాంగ్ సినిమాపై అంచనాలు రెట్టింపు చేశాయి. ఇటీవల వచ్చిన డాక్యు సిరీస్ కూడా మంచి హైప్ తెచ్చి పెట్టింది. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. 3 నిమిషాల 47 సెకండ్ల నిడివితో వచ్చిన 'రణబాలి' ట్రైలర్ ఆకట్టుకుంటోంది. 1854 - 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో శింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ విశ్వరూపం చూపించారు. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటించారు. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ విలన్ పాత్ర పోషిస్తున్నారు. 'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. అజయ్ - అతుల్ సంగీతం సమకూర్చారు. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ - రష్మిక కలిసి నటిస్తున్న సినిమా కావడం.. భార్యాభర్తలుగా మారిన తర్వాత వస్తున్న తొలి సినిమా కావడంతో అభిమానులు ప్రత్యేకంగా భావిస్తున్నారు. అక్టోబర్ 16న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్ కానుంది.

'భారతీయుడు 3 పోస్టర్ విడుదల

విశ్వనటుడు కమల్ హాసన్, అగ్ర దర్శకుడు శంకర్ కాంబోలో వచ్చిన సినిమా 'ఇండియన్'. తెలుగులో 'భారతీయుడు' పేరుతో విడుదలైంది. 1996లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయం సాధించింది. దీనికి కొనసాగింపుగా 2024లో 'భారతీయుడు 2' (ఇండియన్ 2) సినిమా వచ్చింది. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం.. డిజాస్టర్ గా మారింది. దీంతో పార్ట్-3 ఉంటుందా లేదా? అనే దానిపై గత రెండేళ్లుగా సందిగ్ధత నెలకొంది. దీనికి తెర దించుతూ మేకర్స్ ఉన్నట్టుండి 'ఇండియన్ 3' సినిమాపై కీలక అప్డేట్ అందించారు. 'ఇండియన్ 3: వార్ మోడ్' అనే పేరుతో లైకా ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ గురువారం ఆసక్తికరమైన టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఇందులో ముగ్గురు గుర్రపు వ్యక్తులు స్వారీతో దుమ్మురేపుతూ దూసుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. ''ఇండియన్-3 వార్ మోడ్‌లో పునరాగమనం మొదలవుతుంది.. ఏమాత్రం సహనం లేకుండా తిరిగి వస్తున్న సేనాపతి ఈసారి ఎవ్వరినీ ఉపేక్షించడు'' అని పేర్కొన్నారు. ఈ సినిమా హిందీలో 'హిందుస్థాని 3', తెలుగులో ' భారతీయుడు 3 ' పేర్లతో వస్తుందని క్లారిటీ ఇచ్చారు. 'భారతీయుడు 2' సినిమాలో కమల్ హాసన్ తో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య, ప్రియా భవానీ శంకర్, బాబీ సింహా తదితరులు కీలక పాత్రల్లో నటించారు. వీరితో పాటుగా కాజల్ అగర్వాల్ కూడా 'భారతీయుడు 3' చిత్రంలో భాగమయ్యారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. రవి వర్మన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'ఇండియన్ 3: వార్ మోడ్' టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు కానీ, సినిమాని ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారనేది మేకర్స్ వెల్లడించలేదు.

ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు

వెళ్లిపోవాల్సిందే

మరణానికి ముందు నానా పటేకర్ వ్యాఖ్యలు

ప్రముఖ సినీ నటుడు నానా పటేకర్ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలో ఆయనకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం ఒకటి ప్రస్తుతం వార్తల్లో నిలిచింది. తన అకాల మరణానికి కేవలం మూడు రోజుల ముందే గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో పటేకర్? మాట్లాడారు. ఆ సమయంలో తనదైన శైలిలో మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు వెళ్లిపోవాల్సిందే, రేపు నేను ఉంటానో లేదో నాకు తెలియదు. ఆ సమయం ప్రతి ఒక్కరి జీవితంలోనూ వస్తుంది. కానీ అది రాకముందే, 'నేను చేయాలనుకున్న పనిని చేయగలుగుతున్నానా? దాని కోసం ప్రయత్నం చేశానా?' అని మనం ఆలోచించుకోవాలి" అని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 4న గోవాలోని పనాజీ సమీపంలో ఉన్న డోనా పౌలాలో 'సమ్రాట్ క్లబ్ ఇంటర్నేషనల్' నిర్వహించిన కార్యక్రమంలో పటేకర్ ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయన తన స్నేహితుడు, గోవా మాజీ ముఖ్యమంత్రి దివంగత మనోహర్ పారికర్‌ను కూడా స్మరించుకున్నారు. పారికర్ తనకంటే చిన్నవాడైనప్పటికీ, ఒక గొప్ప ఆశయంతో జీవించిన మహోన్నత వ్యక్తి అని ఆయన కొనియాడారు. ఈ లోకాన్ని విడిచిపెట్టేలోపు ఎంతో సాధించాలంటే మనిషిలో బలమైన సంకల్పం ఉండాలని నానా పటేకర్ చెప్పారు. కార్యక్రమం అనంతరం, పటేకర్ స్థానిక బృందంతో కలిసి 'శమెల్' అనే సంప్రదాయ సంగీత వాయిద్యాన్ని వాయించడంతో పాటు, 'దేఖ్నీ' అనే స్థానిక నృత్య రీతిని కూడా ప్రదర్శించారు. మరోవైపు, నటుడు నానా పటేకర్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్రాల మంత్రులు విచారం వ్యక్తంచేశారు. నానా పటేకర్ మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్త చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్?లో పోస్టు పెట్టారు. తనదైన నటనాశైలితో తరతరాలు గుర్తుండిపోయే అద్భుతమైన పాత్రలను పటేకర్? ప్రేక్షకులకు అందించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. నటుడిగానే కాక తాను నమ్మిన విషయాన్ని నిర్భయంగా వ్యక్తపరిచేందుకు ఆయన ఏనాడూ సంకోచించలేదని, పటేకర్ సూటి అభిప్రాయాలకూ ప్రజల నుంచి ప్రశంసలు దక్కాయని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్? పోస్టులో రాసుకొచ్చారు.

పవన్ కల్యాణ్ నా చిన్ననాటి క్రష్: ఆనంది

తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు. తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. "చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.